


ప్రయోగ వేదికపైకి అగ్నికుల్

ప్రైవేట్ రంగంలో రెండో రాకెట్ ప్రయోగానికి శ్రీహరికోటలోని షార్ సిద్ధమవుతోంది.త్వరలో అగ్నికుల్ రాకెట్‌ను ప్రయోగించనున్న నేపథ్యంలో రాకెట్‌ను షార్‌లోని ఏఎస్ఎల్వీ కాంప్లెక్స్‌లో అనుసంధానం చేశారు. మంగళవారం రాకెట్‌ను ప్రైవేట్ ప్రయోగ వేదికకు తరలించారు. అగ్నికుల్ కాస్మోస్,మద్రాసు ఐఐటీ స్పేస్ టెక్నాలజీ స్టార్టప్ తరఫున సబ్ ఆర్బిటల్ రాకెట్‌ను రూపొందించి షార్ నుంచి ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్నికుల్ ప్రయోగ వాహకనౌకకు అగ్నిబాన్ సబార్బిటల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ (ఎస్‌వోఆర్ టీఈడీ)గా నామకరణం చేశారు. ప్రస్తుతం ప్రయోగ వేదిక రాకెట్‌కు పలు తనిఖీలు జరుగుతున్నాయి. ఇది అగ్నిలెట్ ఇంజన్‌తో నడిచే సింగిల్ స్టేజ్ వాహక నౌక. ఈ సెమీ క్రయోజనిక్ ఇంజన్‌ను పూర్తిగా 3డీ సాంకేతికతతో రూపొందించారు. 6కేఎన్ సామర్థ్యాన్ని కలిగిన ఈ రాకెట్‌లో 300 కిలోల పేలోడ్‌తో 700 కిలోమీటర్ల దూరంలో పంపే విధంగా డిజైన్ చేశారు. షార్‌లో అగ్నికుల్‌కు చెందిన సొంత ప్రయోగ వేదిక, మిషన్ కంట్రోల్ సెంటర్‌ను గత ఏడాది ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

- సూళ్లూరుపేట

పొగమంచులో శేషాచలం



వేసవి ప్రారంభ నేపథ్యంలో దేశమంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతుంటే తిరుమల శేషాచల కొండలు మాత్రం దట్టమైన పొగమంచుతో కనువిందు చేస్తున్నాయి.మంగళవారం శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే యాత్రికులు ఈ దృశ్యాలను ఆసక్తిగా తిలకించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



బిల్లులు చెల్లిస్తేనే సచివాలయంలోకి...!


తనకు బిల్లులు చెల్లించే వరకు సచివాలయంలోకి వెళ్లడానికి వీల్లేదంటూ కేవీబీపురం మండలం ఓళ్లూరు సర్పంచ్ సురేష్ సిబ్బందిని అడ్డుకున్నారు. గ్రామస్తులు, వార్డు మెంబర్లతో కలిసి మంగళవారం ఉదయం సచివాలయానికి వచ్చిన సిబ్బందిని లోనికి వెళ్లనీయకుండా డోరు వద్ద అడ్డంగా బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ దయాసాగర్ సచివాలయం వద్దకు వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. గతంలో చేసిన రెండు మోటారు పనులకు రూ.5లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని, అలాగే ప్రస్తుతం మరమ్మతులకు గురైన బోర్లను బాగుచేయించేందుకు సైతం బిల్లులు ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు.తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారని వాపోయారు.తాను టీడీపీ సర్పంచ్ కావడంతోనే ఎంబుక్ బిల్లు పెట్టడం లేదని సర్పంచ్ ఆరోపించారు. రెండు రోజుల్లో బిల్లులు చెల్లించే ప్రయత్నం చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చాక ఆందోళన విరమించారు.

- కేవీబీపురం

రంగులు మారుతున్న నగరి రాజకీయం

వాతావరణ మార్పులతో మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతుండగా, అంతకంటే ఎక్కువగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే నగరి రాజకీయాలు వేడెక్కుతున్నాయి. టీడీపీతో దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకున్న సిద్ధార్థ కళాశాలల చైర్మన్, టీడీపీ నాయకుడు అశోక్‌రాజు మంగళవారం కమలం గూటికి చేరారు. కొంత కాలం నుంచి మంత్రి రోజాపై అస్త్రాలు ఎక్కుపెట్టిన అసమ్మతి నాయకులు అమీతుమీకి సిద్ధమవుతున్నారు.ఈ నేపథ్యంలో మంత్రి రోజా తెరవెనుక రాజకీయాలను ప్రారంభించారు. వరుస పెట్టి సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. నగరికి చెందిన మరో అసమ్మతి నాయకుడు కేజే కుమార్ దంపతులు సోమవారం సాయంత్రం సీఎం జగన్‌ను కలిశారు.

- పుత్తూరు అర్బన్



ఎక్కుపెట్టిన విల్లు దింపని అసమ్మతి

మంత్రి రోజాపై అసమ్మతి నాయకులు ఎక్కుపెట్టిన విల్లు ఇప్పట్లో దింపేలా కనిపించడం లేదు. వారం రోజులుగా మంత్రి రోజా,వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి మధ్య కొనసాగుతున్న పోరు మంగళవారం కొత్త రూపు సంతరించుకుంది. నగరిలో జరిగిన వైసీపీ నాయకుల సమావేశంలో మంత్రి రోజా భర్త సెల్వమణి అసమ్మతి నాయకులపై చేసిన కామెంట్ నిప్పు రాజేసింది. దీంతో పుత్తూరు నుంచి మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చక్రపాణిరెడ్డి సోదరుడు, నిండ్ర ఎంపీటీసీ రెడ్డివారి భాస్కర రెడ్డి, విజయపురం సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ లక్ష్మీపతిరాజు, పుత్తూరుకు చెందిన మరో సీనియర్ నాయకుడు రవిశేఖర్‌రాజు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ మంత్రి రోజా, ఆమె సోదరులు ఈ ఐదేళ్లలో నియోజకవర్గం కేంద్రంగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అలాగే తాము ఈ దఫా ఆమెకు ఎట్టిపరిస్థితుల్లోను పనిచేయబోమని కూడా తేల్చి చెప్పేశారు. ఏలుమలై మొదలియార్ తమ రెక్కల కష్టంతోనే రెండుసార్లు రోజా ఎమ్మెల్యేగా గెలిచిందన్నారు. గత ఎన్నికల మునుపు విజయపురంలోని తన ఇంట్లో జరిగిన సమావేశంలో మంత్రి రోజా దంపతులు తమను నమ్మించి ఎన్నికల తరువాత మోసం చేశారని లక్ష్మీపతిరాజు, రవిశేఖర్‌రాజు ధ్వజమెత్తారు. విజయపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌లో 50 శాతం వాటా మంత్రి రోజా సోదరులకు ముట్టిందని ఆరోపించారు.ప్రజల్లో గూడుకట్టుకుని ఉన్న వ్యతిరేకతను గుర్తించకుండా అధిష్ఠానం మళ్లీ రోజాకు టికెట్ ఇస్తే ఆమె ఓటమికి తాము బాధ్యులు కాబోమని, ఆమెకు తప్ప వేరే ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా పార్టీ గెలుపు కోసం పనిచేస్తామని మీడియా సమావేశంలో జడ్పీటీసీ మురళీధర రెడ్డి, రెడ్డివారి భాస్కరరెడ్డి అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. మంత్రి రోజా, ఆమె కుటుంబంపై ఐదు మండలాలకు చెందిన బలమైన నాయకులు తొలిసారిగా మీడియా ముందుకు వచ్చి బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం వైసీపీ శ్రేణుల్లో అలజడి సృష్టించింది.

కాషాయం కండువా కప్పుకున్న అశోక్‌రాజు

నిన్నటి వరకు పసుపు కండువాను ధరించిన అశోక్‌రాజు మెడలో కాషాయం చేరింది. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసి, ఆయనకు సన్నిహితుడిగా ముద్రపడిన అశోక్‌రాజు మంగళవారం ఉదయం విజయవాడలో బీజేపీ చీఫ్ పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 ఎన్నికల అనంతరం గుంభనంగా ఉన్న ఆయన వారం క్రితం టీడీపీకి రాజీనామా చేశారు. గత ఎన్నికల్లో వైసీపీకి పనిచేశానంటూ తనపై దుష్ప్రచారం చేశారని రాజీనామా సందర్భంగా మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అయితే అశోక్‌రాజు రాజీనామా తాము ముందు నుంచి ఊహించిందేనని, దీని వల్ల కలిగే నష్టం ఏమీలేదని టీడీపీ వర్గాలు తేల్చేస్తున్నాయి.

రాజకీయ భేటీలతో మంత్రి బిజీ

రాజకీయ సమావేశాలతో మంత్రి రోజా బిజీ బిజీగా గడుపుతున్నారు. మండలాల నుంచి వైసీపీ నాయకులను నగరిలోని తన కార్యాలయానికి పిలిపించుకుని చర్చిస్తున్నారు. ఇటీవల పీసీసీ ప్రెసిడెంట్ షర్మిల సభ నగరిలో విజయవంతం కావడంతో రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓట్లలో చీలిక రానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో అసమ్మతి నాయకుల ప్రభావం కూడా ఈ దఫా స్పష్టంగా ఉండనుందనే వాదనలున్నాయి. దీంతో నష్టనివారణ చర్యలకు దిగిన రోజా తన అనుకూల నాయకులతో పాటు ప్రధానంగా కులసమీకరణాలకు ప్రాధాన్యతనిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఒక్కోరోజు ఒక్కో మండలం నుంచి ఒక ప్రధాన కులంతో సమావేశమై వారి మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. 2019లో సమరోత్సాహంతో ఎన్నికలను ఎదుర్కొన్న వైసీపీ క్యాడర్ ఈ ఐదేళ్లలో మారిన సమీకరణాలు, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తలెత్తిన అసంతృప్తి, వరుసగా పార్టీలో జరుగుతున్న సంఘటనలతో మునుపటి ఉత్సాహాన్ని ప్రదర్శించలేకపోతున్నాయనే ప్రచారం పొలిటికల్ సర్కిల్స్‌లో పెరుగుతోంది.

సీఎంతో కేజే దంపతుల భేటీ

తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేజే శాంతి, మాజీ మున్సిపల్ చైర్మన్ కేజే కుమార్ దంపతులు సోమవారం సాయంత్రం సీఎం జగన్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2019లో మంత్రి రోజా రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మొట్టమొదట బయటకు వచ్చింది కేజే కుమార్ దంపతులే. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. రోజా అభ్యర్థిత్వాన్ని కేజే కుమార్ దంపతులు తొలినుంచీ తీవ్రంగా విభేదిస్తున్నారు. సీఎంను కలిసిన కేజే కుమార్ దంపతులు భేటీ తరువాత నిరాశతో వెనుదిరిగినట్లు సమాచారం.



కలెక్టర్ లక్ష్మీశతో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

- భక్తుల భద్రతకు ప్రాధాన్యం
- ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 5: సమగ్ర ప్రణాళిక రూపొందించి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తామని ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ తెలిపారు. మంగళవారం వేకువ జామునే తిరుపతికి చేరుకున్న ఆయన తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహిస్తామని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపి.. శాంతి భద్రతలకు పెద్ద పీట వేస్తామన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వచ్చే భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం, శ్రీసిటీ పారిశ్రామికవాడ ప్రాంతాల్లో పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం అధికారులు, సిబ్బంది ఒక టీమ్‌గా పనిచేస్తామని వివరించారు. వీటన్నింటితో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం జిల్లాలోని పోలీసు అధికారులు నూతన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.అనంతరం కలెక్టర్ లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిశారు.

నా కష్టానికి ఫలితం దక్కింది

వినుకొండ సుబ్రమణ్యం



డోలు సంగీత వాయిద్యాన్ని కష్టపడి నేర్చుకున్న తాను కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని వినుకొండ సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు.ఓ చిన్న గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తాను 11వ సంవత్సరం నుంచే డోలు మీద సాధన చేశానన్న సుబ్రమణ్యంతో సంభాషణ...

? స్ఫూర్తి

! అమ్మానాన్నలు వినుకొండ కృష్ణయ్య, సుబ్బమ్మ నాకు ఆదర్శం.ఏదోఒక వృత్తివిద్యలో రాణించాలని వారు చెప్పిన మాటలే స్ఫూర్తి.

? డోలు వాద్యంపై మక్కువ

! చిన్నతనం నుంచే డోలు వాద్యంపై ఎక్కువగా ఆసక్తి ఉండేది.ఆ ఆసక్తి ఇష్టంగా మారడంతో కష్టపడి సాధన చేశా.తిరుపతిలోని బసవయ్య, రాజగోపాల్ వద్ద 10 సంవత్సరాలు శిక్షణ పొందా.

? కచేరీల మాట

! దేశవ్యాప్తంగా 400కు పైగా కచేరీల్లో పాల్గొన్నా. ప్రముఖ నాదస్వర విద్వాంసుడు ఏకేసీ నటరాజన్‌తో కలిసి పలు కచేరీల్లోనూ, షేక్ యాకబ్‌సాహెబ్, బడేసాహెబ్ నాదస్వరంతో కలిసి విజయవాడలోని ఆలిండియా రేడియోలో కార్యక్రమంలో పాల్గొన్నా.అంతేకాదు ఢిల్లీలో నేషనల్ ప్రోగ్రాం మ్యూజిక్ ఆడిషన్‌కు న్యాయనిర్ణేతగా వ్యవహరించా.

? శిక్షణ

! ఈ విద్యను విస్తరించాలన్న ఉద్దేశంతో డబ్బులు తీసుకోకుండా 300 మందికి పైగా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించా.

- గూడూరు



తిరుమలలో నాదనీరాజనం వేదికపై వినుకొండ సుబ్రమణ్యం

శివరాత్రి ఉత్సవాల్లో భూతరాత్రి ఏకాంతం




ఆలయంలోనే ఆదిదంపతుల ప్రదక్షిణ

శ్రీకాళహస్తి, మార్చి 5: వాయులింగేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం జరగాల్సిన భూత రాత్రి మొదటి వాహన సేవ ఏకాంతంగా జరిగింది. మంగళవారం రాత్రి స్వామివారు భూత, అమ్మవారు శుక (చిలుక)వాహనంపై అధిష్ఠించి భక్తులకు దర్శనం ఇవ్వాల్సి ఉంది. కానీ మాడ వీధుల్లోని నెహ్రూ రోడ్డుకు ఆనుకుని ఉన్న జెట్టిపాలెం సందులో ఒకరు శివైక్యం చెందారు. సంప్రోక్షణకు సమయం సరిపోకపోవడంతో ఆగమ నియమం ప్రకారం భూత వాహన సేవను ఏకాంతంగా మార్చారు.ఆలయం లోపలే ఉత్సవమూర్తులను ప్రదక్షిణ పూర్వకంగా తిప్పి తిరిగి కొలువుదీర్చారు.మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై చంద్రశేఖరుడి రాజసం, చప్పరంపై జ్ఞానాంబిక అమ్మవారి వైభవాన్ని భక్తులు దర్శించుకుని తరించారు.

శ్రీవారి సెంటిమెంట్‌తో టికెట్ కోసం...

చంద్రబాబుకు నరసింహయాదవ్ లేఖ



తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో పదవుల కోసం, అవకాశాల కోసం నేతలు రకరకాల మార్గాలు ఎంచుకోవడం పరిపాటి.తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ కూడా తిరుపతి టీడీపీ టికెట్ కోసం శ్రీవారి సెంటిమెంట్‌ను తెరపైకి తీసుకొచ్చారు. తిరుమలలో శ్రీవారు యాదవులకు తొలి దర్శన భాగ్యం కల్పించారని... అలాగే తిరుపతిలో ఎమ్మెల్యేగా యాదవులకు తొలిసారి అవకాశం కల్పించాలంటూ అధినేత చంద్రబాబును అభ్యర్థించారు. ఈ మేరకు ఆయన ఓ లేఖను మంగళగిరిలో మంగళవారం జరిగిన జయహో బీసీ సదస్సు వేదికపై చంద్రబాబుకు అందజేశారు. తిరుమల, తిరుపతిలకు చెందిన యాదవులతో వెంకటేశ్వర స్వామికి బంధం వుందని పేర్కొన్నారు. అదే సామాజికవర్గానికి చెందిన తనకు తిరుపతి అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా వున్న యాదవ సామాజికవర్గానికి తెలుగుదేశం పార్టీపై అభిమానం మరింత పెరిగే పరిస్థితి వుంటుందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా తిరుపతి టీడీపీలో కొనసాగుతున్న నరసింహయాదవ్ బీసీ కోటాలో అసెంబ్లీ టికెట్ కోసం గత ఎన్నికల్లోనూ గట్టిగా యత్నించారు. టికెట్ దక్కకపోయినా తుడా చైర్మన్ పదవి లభించింది. తర్వాత పార్లమెంటు పార్టీ అధ్యక్ష పదవి కూడా దక్కింది. రానున్న ఎన్నికల్లో కూడా టికెట్ కోసం రేసులో వున్న నరసింహ యాదవ్ పార్టీ జయహో బీసీ సదస్సులో ఈ మేరకు లేఖ అందజేసి అధినేత దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించారు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన రూ.కోటి

ఆధారాలు చూపించడంతో వదిలిపెట్టిన పోలీసులు

చంద్రగిరి, మార్చి5:చంద్రగిరి మండలం పాకాలవారిపల్లె చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఉదయం వాహనాల తనిఖీల్లో కోటి రూపాయల నగదును పోలీసులు పట్టుకున్నారు. అయితే ఆ నగదుకు సరైన ఆధారాలు చూపించడంతో పోలీసులు ఆవాహనాన్ని వదిలిపెట్టారు. ఆ వాహనం బెంగుళూరులోని రామలింగం కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ చెందినదిగా పోలీసులు తెలిపారు.

సూర్య, చంద్రప్రభలపై ఆదిదంపతులు




చంద్రగిరి, మార్చి 5: తొండ వాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం సూర్యప్రభ ,చంద్రప్రభ వాహనాలపై పార్వతీపరమేశ్వరులు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటలకు పార్వతీపరమేశ్వర్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి సూర్య ప్రభ వాహనంలో ఆలయ ప్రదక్షణ చేయించారు. 9 గంటలకు సుబ్రమణ్యస్వామికి, ఆంజనేయస్వామికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, చంద్రప్రభ వాహనంపై ఆలయ ప్రదక్షణగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

తలకోన శివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ




శివరాత్రి బహోత్సవాలకు అంకుర్పాణకు పుట్ట మన్ను తెస్తున్న అర్చకులు - కలశ స్థాపన చేస్తున్న అర్చకులు

ఎర్రావారిపాలెం, మార్చి 5: జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు మంగళవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ప్రధాన అర్చకులు ప్రసన్న స్వామి ఆధ్వర్యంలోని పండితుల బృందం వేద మంత్రోచ్చారణతో తలకోన ఆలయానికి పశ్చిమం వైపున్న పుట్ట మన్నును ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఈవో జయకుమార్ వెండి తట్టలో తీసుకొచ్చారు. ఆలయంలోని హోమశాలలో పుట్ట మట్టితో గణపతి పూజోత్సవం జరిగింది. 108 కలశాల స్థాపనతో మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ క్రతువును వేద పండితులు జరిపారు. గోపూజ వ్రతం నిర్వహించారు.సాయంత్రం రుద్రపారాయణం జరిపారు.

శ్రీశైల మల్లికార్జునస్వామికి పాగా వస్త్రం




పాగాలంకరణ వస్త్రాన్ని నేస్తున్న సామా దేశయ్య - సిద్ధమైన వస్త్రం

పుత్తూరు టౌన్, మార్చి 5: శ్రీశైలంలోని మల్లికార్జున స్వామికి పుత్తూరు మండలంలోని గొల్లపల్లికి చెందిన సామా దేశయ్య పాగా వస్త్రం సిద్ధం చేశారు. భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి శివరాత్రి పర్వదినం సందర్భంగా పాగాలంకరణ సేవ నిర్వహిస్తారు. స్వామివారి సేవ కోసం సామా దేశయ్య చేనేత మగ్గంపై 300 మూరల పొడవు, ఒక మూర వెడల్పుతో తెల్లని వస్త్రాన్ని ప్రత్యేకంగా తయారు చేశారు. సాధారణంగా వివాహ సమయంలో పెళ్లి కుమారుడికి తలపాగా చుట్టడం వైదిక సంప్రదాయమని, శైవక్షేత్రాల్లో ఒక్క శ్రీశైలంలో మాత్రమే ఈ ఆచారం కొనసాగుతోందని, స్వామివారి పాగాలంకరణ సేవకు వస్త్రాన్ని తయారు చేసి సమర్పించడం తమ పూర్వ జన్మసుకృతమని దేశయ్య అన్నారు.

స్థానికంగానే ఇళ్లస్థలాలు కేటాయించాలి : సీపీఎం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి (రవాణా), మార్చి 5: మంగళం ఉమ్మడి పంచాయతీలో లబ్ధిదారులకు స్థానికంగా ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఎం నేత కందారపు మురళి డిమాండ్ చేశారు. మంగళవారం రణధీర పురం పంచాయతీ బీటీఆర్‌కాలనీలో గల ఆ పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు పట్టాలు ఇచ్చి సుదూర ప్రాంతమైన చిందేపల్లి, అగ్రహారం, ఐతేపల్లి అడవుల్లో స్థలాలను చూపడం సమంజసం కాదన్నారు. మంగళంలో వైసీపీ నేతల ఆక్రమణలు పెచ్చుమీరి పోతున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేవారు ఎవరైనా స్థానికంగా ఇళ్లస్థలాలను ఇస్తామని హామీ ఇవ్వాలని కోరారు. టీడీపీ, జనసేన నేతలు సురేష్, చంద్ర, సుబ్బుయాదవ్, అల్లాబాషా, రత్నం మాట్లాడుతూ స్థానికంగానే ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి టీడీపీ కట్టుబడి ఉందని ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పులివర్తి నాని ప్రకటించారన్నారు. పంచాయతీలో ప్రజలకు తెలుగు గంగ నీరు అందిస్తామని చెప్పిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఐదు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటి వరకు పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వేణుగోపాల్, నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బుజ్జి, స్థానిక సీపీఎం నాయకులు బాదుల్లా, మోదీన్, హమీద్, వెంకటేష్, టీడీపీ, జనసేన పార్టీలకు సంబంధించిన నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

టీడీపీ వాణిజ్యవిభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్‌రెడ్డి



తిరుపతి(రూరల్), మార్చి 5:టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీగా తుమ్మలగుంట గ్రామానికి చెందిన బిరుదాల భాస్కర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను త్రికరణశుద్ధితో నిర్వర్తిస్తానని చెప్పారు. చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని పేర్కొన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారకులైన పార్టీ అధినేత చంద్రబాబుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నానికి, పులివర్తి సుధారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఈయన్ను సైకం జయచంద్రారెడ్డితోపాటు రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌నాయుడు, వైకుంఠం శ్రీధర్‌నాయుడు తదితరులు అభినందించారు.

విచారణకు హాజరుకాని రమణదీక్షితులు

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన, గౌరవప్రధాన అర్చకులు రమణ దీక్షితులు పోలీసు విచారణకు హాజరుకాలేదు. టీటీడీ పరిపాలన అంశాలు, అర్చకులు, జీయర్లు, అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నట్టుగా గత నెల 21వ తేదీన సోషల్‌మీడియాలో ఓ వీడియో చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. దీనిపై జీయర్లు, అర్చకులు తీవ్ర స్థాయిలో మండిపడడంతో పాటు ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ టీటీడీ ఉన్నతాధికారులను కోరారు. టీటీడీ వ్యవస్థను, అధికారులను కూడా కించపరుస్తున్నట్లు రమణదీక్షితులు వ్యాఖ్యలున్నాయని భావించిన ధర్మకర్తల మండలిలో గత నెల 26వ తేదీన జరిగిన సమావేశంలో రమణదీక్షితులను టీటీడీ నుంచి తొలగిస్తూ తీర్మానం చేసింది. దీంతో పాటు 23వ తేదీన టీటీడీ ఐటీ విభాగంలోని సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మానిటరింగ్ సెల్ జీఎం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మార్చి5వ తేదీ ఉదయం 9 గంటలలోపు విచారణకు హాజరుకావాలని రమణదీక్షితులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే రమణదీక్షితులు మాత్రం 5వ తేదీ రాత్రి వరకు కూడా విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరుకాలేకపోతున్నట్టు రమణదీక్షితులు పోలీసులకు చెప్పినట్టు సమాచారం.ఈ నేపథ్యంలో పోలీసులు ఎలా వ్యవహరించబోతున్నారనే అంశం చర్చనీయాంశమైంది.

మహిళాభివృద్ధితో దేశపురోభివృద్ధి

● రాస్ ప్రెసిడెంట్ సుందరవడివేలు



వెంకయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న స్వయం సహాయక సంఘ మహిళా సభ్యులు

తిరుపతి(విద్య), మార్చి 5: మహిళల అభివృద్ధి తోనే సమాజంతోపాటు దేశపురోభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రెసిడెంట్ జి.సుందర వడివేలు అన్నారు. స్థానిక పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ముందస్తు మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మనదేశంలో మహిళలకు గౌరవంతోపాటు చాలా ప్రాధాన్యం ఉందన్నారు. జడ్జి, కలెక్టర్ వంటి ఉన్నత హోదాల్లో ఉన్నా ఆ ఇంటిని లీడ్ చేసేది మాత్రం మహిళలే అని గుర్తుచేశారు. తాను కళాశాల చదివే రోజుల నుంచి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి మాటలు వినడానికి ఇష్టపడేవాడినని చెప్పారు. భాషాపరంగా కొంత ఇబ్బందిగా ఉన్నా ఆయన మాటసరళి అద్భుతంగా ఉండడం వల్ల అర్థం కాకపోయినా వింటుండేవాడినని తెలిపారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ ఏ దేశంలో విద్యాదేవతగా సరస్వతీదేవిని ఆరాధిస్తున్నామో.. ఆ సంస్కృతికి వారసులైన మనమందరమూ గర్వపడాల్సి ఉందని చెప్పారు. ద్రవిడవర్సిటీ వీసీ కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ దేశం గర్వించే ఉన్నతస్థాయికి ఎదిగి, ఉత్తమ వ్యక్తిత్వం ఉన్న వెంకయ్యనాయుడిని తీర్చిదిద్దిన శ్రీమూర్తి వ్యక్తిత్వం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘ మహిళా సభ్యులకు రూ.15కోట్ల 30లక్షల 90వేల చెక్కును మాజీ ఉపరాష్ట్రపతి చేతులమీదుగా అందజేశారు. రాస్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్.వెంకటరత్నంనాయుడు, వైస్‌ప్రెసిడెంట్ కె.చిరంజీవి, డైరెక్టర్ వి.నాగరాజు, కేవీకే ఇన్‌చార్జి డాక్టర్ శ్రీనివాసులు, మోహన్, యువరాజు,రమేష్‌రెడ్డి, మమత, సమత, బాలాజీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మమ్మ ద్వారా అనేక విషయాలు నేర్చుకున్నా : వెంకయ్యనాయుడు

ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'మా అమ్మ నా చిన్నతనంలో చనిపోతే, మా అమ్మమ్మ పెంచింది. అనేక విషయాలు ఆమె ద్వారానే నేర్చుకున్నా. ఇంట్లో పిల్లలను అవ్వాతాతల వద్ద ఉంచండి. వాళ్ల చెప్పే విలువైన మాటలు పిల్లల వికాసానికి ఎంతో దోహదపడతాయి. మన కట్టు, బొట్టు, మాట, పాట, యాస, భాష మన గోస ఇవన్నీ మన సంప్రదాయ ఆస్తులు. గ్రామాల్లో ఐదు శాతం మందికి కూడా ఆంగ్లం రాదు. అయినా ప్రభుత్వ గెజిట్ సమాచారం ఇంగ్లీషులో పంపుతుంటారు. ఇవన్నీ మారాలి. మహిళలకు విద్య ఎంతో అవసరం. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భేటీ బచావో, భేటీ పడావో పథకం అద్భుతమైనది. కన్న తల్లిని, జన్మభూమిని, మాతృభూమిని మర్చిపోకూడదు' అని చెప్పారు.

గజ వాహనంపై అభయమూర్తి




హనుమంత వాహనంపై వెంకటాద్రిరాముడి అలంకరణలో కల్యాణ వెంకన్న - గజ వాహనంపై అభయమూర్తి అలంకరణలో శ్రీవారు



స్వర్ణరథంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకన్న

చంద్రగిరి, మార్చి 5: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి మంగళవారం ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి వెంకటాద్రిరాముడుగా అలంకరించి హనుమంత వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం కల్యాణ మండపంలో ఉత్సవర్లకు వసంతోత్సవం నిర్వహించారు.అనంతరం అర్చకులు, భక్తులు వసంతాలు చల్లుకున్నారు. రాత్రి ఉత్సవమూర్తికి రాజు అలంకరణ చేసి, గజ వాహనంపై మాడవీధుల్లో వృషభ, అశ్వ, గజరాజులు ముందు నడుస్తుండగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, కేరళ వాయిద్యాలు, గోవింద నామ స్మరణల నడుమ భక్తులకు దర్శనమిచ్చారు.డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ బట్టర్ శేషాచార్యులు, ఏఈవో గోపినాథ్, అర్చకులు పార్థసారధి, బాలాజీరంగాచార్యులు, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు ముని చెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన స్వర్ణ రథంపై అధిష్ఠించి సంకల్ప పూజలు నిర్వహించారు. అనంతరం స్వర్ణ రథాన్ని గోవింద నామస్మరణల చేస్తూ టీటీడీ అధికారులు, భక్తులు నెమ్మదిగా లాగారు.

రేపు పద్మావతి మహిళా వర్సిటీ స్నాతకోత్సవం

● గాయని సుశీలకు గౌరవ డాక్టరేట్

● గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక



మీడియాతో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవం గురువారం నిర్వహించనున్నారు. వివరాలను వర్సిటీలో మంగళవారం వీసీ భారతి మీడియాకు వెల్లడించారు. ఆమె మాటల్లోనే.. 'ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. గాయని పి.సుశీలకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నాం. 57మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తాం. 12మందికి పుస్తక, నలుగురికి నగదు బహుమతులిస్తాం. విద్యార్థులను ఉద్దేశించి ఇస్రో శాస్త్రవేత్త మంగళ మణి ప్రసంగిస్తారు. 859 మందికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేస్తాం. ఇటీవల కాలంలో వర్సిటీ మంచి అభివృద్ధిని సాధిస్తోంది. నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాం. పీఎం ఉష పథకం ద్వారా రూ.100 కోట్లు పొందాం' అని వీసీ వివరించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ రజని, సీనియర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి, పీఆర్వో శ్రీరజని పాల్గొన్నారు.

మంత్రి రోజాకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం

● వైసీపీ అధిష్ఠానానికి నగరి వైసీపీ నేతల అల్టిమేటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 5: మంత్రి రోజాకు నగరి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని నియోజకవర్గ వైసీపీ నాయకులు అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డితో పాటు నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు రెడ్డివారి భాస్కర రెడ్డి, ఏలుమలై, రవి, శేఖర్‌రాజు, వాసు దేవరెడ్డి, మునీంద్ర, లక్ష్మీపతిరాజు, శ్రీధర్‌రాజు, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో రోజాను గెలిపించడానికి ఆస్తులమ్ముకుని కష్టపడ్డామని చెప్పుకొచ్చారు. తనకు ఐదుగురు అన్నదమ్ములు అని ప్రతి సభలో ఊదరగొట్టిన రోజా ఇపుడు తమనే ఇబ్బందుల పాల్జేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి పాలైన రోజాకు బాసటగా నిలిచామని, ఐరన్‌లెగ్‌గా పేరు పొందిన రోజాను గోల్డెన్‌లెగ్‌గా మార్చి 2014లో ఎమ్మెల్యేని చేశామన్నారు. నగరి నియోజకవర్గాన్ని తన అక్రమార్జనకు అడ్డాగా చేసుకున్న మంత్రి రోజా తమను పక్కకు నెట్టేసిందన్నారు. నగరి ప్రజలు ఆమె పట్ల సానుకూలంగా లేరన్నారు. వైసీపీ అధిష్ఠానం ప్రజాభీష్టంతో పాటు క్యాడర్ విజ్ఞప్తిని మన్నించి ఎమ్మెల్యే టిక్కెట్టు ఇతరులకు కేటాయిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. అలాకాదని రోజాకే సీటు కేటాయిస్తే ఓడిస్తామని హెచ్చరించారు. తమపై నిందారోపణలు చేస్తున్న మంత్రి రోజా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

అభివృద్ధిని విస్మరించిన చెవిరెడ్డి

● వైసీపీ ఎమ్మెల్యేపై పులివర్తి నాని ధ్వజం



తిరుచానూరు, మార్చి 5: చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఇప్పుడు కొత్తగా ఆయన నోట అభివృద్ధి మాట వినపడటం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని ధ్వజమెత్తారు. మంగళవారం 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆయన తిరుచానూరులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మ్యానిఫెస్టోలోని అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఎమ్మెల్యేగా చెవిరెడ్డి చేసిందేమీ లేదని ఏ పంచాయతీలో చూసినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తెలిపారు. తిరుచానూరు పంచాయతీకి అధిక ఆదాయం వస్తున్నా సమస్యల పరిష్కారంలో మాత్రం వెనకంజలో ఉందన్నారు. అవినీతి పరులు రాజ్యమేలితే పరిస్థితి ఇలాగే ఉంటుందని మండిపడ్డారు. ప్రభుత్వ భూములతో ప్రైవేటు భూములు కూడా కబ్జాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ గెలుపుతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు ఈశ్వర్ రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాల్మన్‌రాజ్, శ్రీనివాసులు, మునిరత్నంరెడ్డి, వాసు, హరేరామ్, సాయి రాయల్, రాజేంద్ర, మార్కండేయులు, రామారావు, విజయలక్ష్మి, నాయక్ మధుశేఖర్, మధు, శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతమ్మ తిరునాళ్లు

చంద్రగిరి, మార్చి 5: చంద్రగిరి మండలం ముంగిలిపట్టులో జరుగుతున్న మాతమ్మ తిరునాళ్లలో టీడీపీ నేత పులివర్తినాని పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

బీజేపీలో చేరిన సిద్ధార్థ అశోక్‌రాజు



పురందేశ్వరి చేతులమీదుగా బీజేపీ కండువా కప్పుకుంటున్న అశోక్‌రాజు

నగరి, మార్చి 5: నగరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల అధినేత అశోక్‌రాజు మంగళవారం విజయవాడలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అశోక్‌రాజుకు పురందేశ్వరి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నరేంద్రమోదీ సిద్ధాంతాలకు ఆకర్షితుడనై బీజేపీ చేరుతున్నట్లు ఆయన తెలిపారు. అశోక్‌రాజు టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు వ్యక్తిగత సహాయకుడిగా సైతం పనిచేశారు. జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు జగదీశ్వర నాయుడు, జిల్లా ఇన్‌చార్జి రాటకొండ విశ్వనాథ్, మహిళామోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణస్వామి నాయుడు, శ్రీనివాసులు, వెంకటముని, రమేష్ నాయుడు, తులసీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆడసింహం మృతి



మృతి చెందిన సింహం

తిరుపతి(మంగళం), మార్చి 5: శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శన శాల (జూ)లో ఓ ఆడ సింహం అనారోగ్యంతో మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు క్యూరేటర్ సెల్వం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2017లో జన్మించిన ఈ సింహం ఏడాదికాలంగా ట్యూమర్ వ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో మెరుగైన వైద్యమందిస్తున్నా కోలుకోలేదన్నారు. క్రమేణా ఆరోగ్యం క్షీణించి నాలుగు రోజులుగా ఆహారం కూడా తీసుకోలేదని తెలిపారు. చివరకు తీవ్ర అనారోగ్యానికి గురై చనిపోయిందన్నారు. కళేబరాన్ని పంచనామ నిమిత్తం ఎస్వీ మెటర్నిటీ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

ఎన్ఎస్‌యూలో శంకరాచార్య అధ్యయన మండపానికి భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శంకరవిజయేంద్ర సరస్వతి

తిరుపతి(విద్య), మార్చి 5: తిరుపతిలోని జాతీయసంస్కృత వర్సిటీలో నిర్మించనున్న శంకరాచార్య అధ్యయన మండపానికి మంగళవారం కంచికామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్ర సరస్వతి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రపరిరక్షణలో వర్సిటీ ప్రథమ స్థానంలో ఉందన్నారు. శంకరాచార్యుల సాహిత్యంపై వివిధ జాతీయ సదస్సులు నిర్వహించి తద్వారా శంకరాచార్య అద్వైతాన్ని అందరికీ అందించాలని ఆకాంక్షించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్‌డీన్ టీవీ రాఘవాచార్యులు, రిజిస్ట్రార్ రమాశ్రీ, పరమాచార్య శాస్త్రపరిరక్షణ కేంద్రం డైరెక్టర్ గణపతిభట్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమన ఇంట్లో షణ్ముఖ యాగం




తిరుపతి (కల్చరల్), మార్చి 5: తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఇంట్లో మంగళవారం షణ్ముఖ యాగం జరిగింది.మధ్యాహ్నం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, మేయర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు సిద్దార్థ విద్యార్థుల ఎంపిక

తిరుపతి(విద్య), మార్చి 5: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలో ఉన్న సిద్దార్థ ఇంజనీరింగ్ అండ్ ఎంబీఏ కళాశాలలో షిర్డిసాయి ఎలక్ట్రికల్, ఇండోసోల్ సోలార్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. బీటెక్ ఫైనలియర్ (ఈఈఈ, మెకానికల్ ఇంజినీరింగ్, ఈసీఈ)విద్యార్థులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి 28 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారని వివరించారు. విద్యార్థులకు వార్షికవేతనం రూ.4.2లక్షలుగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులను ఛైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ వై.విజయ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ పి.స్వామినాథ్, టీపీవో భాస్కర్, అధ్యాపకులు అభినందించారు.

వి.కోటలో పోలీసుల వీరంగం

● పుష్పపల్లకి సేవ కవరేజీకు వెళ్లకుండా మీడియా ప్రతినిధుల అడ్డగింత

● ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తను చితకబాదిన పెద్దపంజాణి ఎస్ఐ

● మీడియా ప్రతినిధులతో పాటు టీడీపీ వారిపైనా కేసులు

వి.కోట, మార్చి 5: చిత్తూరు జిల్లా వి.కోటలో సోమవారం రాత్రి జరిగిన వీరాంజనేయస్వామి పుష్ప పల్లకి సేవ సందర్భంగా ఓ ఎస్ఐ వీరంగం..



తీవ్ర విమర్శలకు దారితీసింది. పల్లకి సేవ కవరేజ్‌కు వెళుతున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరి జగన్ ద్విచక్ర వాహనాన్ని అనుమతించలేదు. కవరేజ్‌కు వెళ్లాలని అడగ్గా.. బందోబస్తు విధుల్లో ఉన్న పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులు అసభ్యపదజాలంతో దూషించారు. అక్కడే ఉన్న వివిధ ఛానళ్ల ప్రతినిధులు ఎస్ఐ తీరును తప్పుబట్టారు. అక్కడకు చేరుకున్న కొందరు మీడియాపట్ల పోలీసుల తీరు సరికాదని వాదనకు దిగారు. పోలీసుల తీరును తప్పుపట్టిన వారిలో తుపాకిచిన్నేపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త చెంగప్ప అనే బాబు కూడా ఉన్నారు. అతడిని ఎస్ఐ, సిబ్బంది బూటు కాళ్లతో తన్ని, పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతడిని విడిచిపెట్టాలని మీడియా ప్రతినిధులు నిరసనకు దిగడంతో స్టేషన్ నుంచి వదిలేశారు. పోలీసుల దెబ్బలకు అతడి చెవిలో రక్తస్రావం కావడం.. రెండు చెవులూ వినిపించక పోవడంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమ కార్యకర్తను పోలీసులు చావబాదారన్న విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు. ఆపై ఎన్టీఆర్ కూడలిలో పోలీసుల తీరును నిరసిస్తూ ధర్నాకు దిగారు. అకారణంగా తమ కార్యకర్తను చితకబాదిన ఎస్ఐ క్షమాపణ చెప్పే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించారు. టీడీపీ నేతలకు సర్దిచెప్పేందుకు సీఐ లింగప్ప ప్రయత్నించగా.. ఎస్ఐ క్షమాపణ చెప్పాలంటూ పట్టుబట్టారు. వీరాంజనేయస్వామి పుష్ప పల్లకి ఎన్టీఆర్ కూడలికి చేరుకున్నా వీరు ధర్నా విరమించలేదు. దీంతో పోలీసులు టీడీపీ శ్రేణులపై లాఠీ ఝుళిపించారు. ఈ క్రమంలో పోలీసులు, టీడీపీ వారి మధ్య తోపులాట జరిగింది. తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొందరు నేతలు గాయపడ్డారు. చివరకు టీడీపీ నేతలు ధర్నా విరమించి పక్కకు తప్పుకోవడంతో పల్లకి ముందుకు సాగింది. ఆ సమయంలో కొందరు వైసీపీ శ్రేణులు జై జగన్ అంటూ కేకలు వేయడంతో మరోసారి ఉద్రిక్తంగా మారింది. 57 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పలమనేరు వైసీపీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పల్లకిలో డ్రైవర్‌గా వాహనాన్ని నడిపారు.

విలేకరులు, టీడీపీ నేతలపై రెండు కేసులు

● వి.కోట పుష్ప పల్లకి సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై పోలీసులు విలేకరులు, టీడీపీ నేతలపై రెండు కేసులు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కల్పించారంటూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరి జగన్‌మోహన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సునీల్, రోషన్, అశోక్‌తో పాటు పోలీసుల చేతిలో దెబ్బలుతిన్న చెంగప్ప అలియాస్ బాబు సహా ఐదుగురిపై కేసు పెట్టారు.

● పుష్పపల్లకీ వస్తున్నా ఎన్టీఆర్ కూడలి వద్ద గుంపుగా చేరి ఆందోళనకు దిగారంటూ మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, మాజీ మండల పార్టీ కార్యదర్శి సోమశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ధీరజ్‌తో పాటు 26 మందిపైన.. ఇక్కడా నలుగురు విలేకరులను నిందితులుగా చేర్చి మొత్తం 30 మందిపై మరో కేసు నమోదైంది. కాగా, జర్నలిస్టులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలంటూ అంబేడ్కర్ కూడలిలో మంగళవారం రాత్రి ప్రెస్ క్లబ్ నేతృత్వంలో మీడియా ప్రతినిధులు ఆందోళన చేశారు.

టీడీపీ మైనారిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా మెహబూబ్ బాషా



తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా తిరుపతికి చెందిన షేక్ మెహబూబ్ బాషా నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ముస్లిం మైనారిటీ రాష్ట్ర కమిటీని 19 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. టౌన్‌బ్యాంకు డైరెక్టర్‌గా పనిచేసిన బాషాకు రాష్ట్ర కమిటీలో చోటు రావడంపై పలువురు అభినందించారు. మాజీ ఎమ్మెల్యే, తిరుపతి టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.

ప్రజల కోసం పోరాడేవారినే ఎంపీలుగా ఎన్నుకోవాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్



తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పోరాడే వారినే ఎంపీలుగా ఎన్నుకోవాలని తెలుగు రాష్ట్రాల ప్రజలను కోరుతున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ హామీలిచ్చిందని, ఇపుడు ప్రతి హామీని దాటవేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

ఆయాల సమస్యలు పరిష్కరించండి



విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం ఇస్తున్న ఆయాలు

తిరుపతి (కలెక్టరేట్), మార్చి 5: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆయాలు, స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద డీఈవో లేకపోవడంతో అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి వైఎస్ మణి, స్వీపర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లాజరస్ మాట్లాడారు. పెండింగులోని బకాయిలను విడుదల చేయాలని, వందమంది విద్యార్థులు దాటినచోట అదనంగా మరో వర్కర్‌ను కేటాయించాలని కోరారు. జిల్లా యూనియన్ అధ్యక్షురాలు సుశీల, ఉమా, చంద్రయ్య, జ్యోతి, పార్వతి, మునిలక్ష్మమ్మ, రాధ, కనకరాజు తదతరులు పాల్గొన్నారు.

విపత్తు స్పందనపై కలెక్టర్ సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 5: విపత్తు స్పందన, అగ్నిమాపకశాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖలపై కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష నిర్వహించారు. అధునాతన పరికరాలు సమకూర్చుకోవాలని, ప్రతిపాదనలు సమర్పిస్తే త్వరగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల విధులు పక్కాగా నిర్వహించాలన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య మాట్లాడుతూ.. మిచౌంగ్ తుఫాన్ సమయంలో 73మందిని రక్షించినట్లు తెలిపారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర మాట్లాడుతూ.. సారా, గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎప్పటికపుడు నియంత్రిస్తున్నట్లు తెలియజేశారు. అధికారులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీటీడీ ఉద్యోగుల క్రీడలు



తిరుపతి అర్బన్, మార్చి 5: టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం జరిగిన జూనియర్స్ విభాగం క్యారమ్స్ సింగిల్స్‌లో శంకర్‌కుమార్‌పై చీర్లకిరణ్ విజయం సాధించారు. డబుల్స్‌లో రమేష్‌బాబు, కోదండచెట్టి జట్టుపై చీర్లకిరణ్, శంకర్‌కుమార్ జట్టు గెలుపొందింది. సీనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్‌లో మధుసూదనరావు జట్టుపై గోపాలకృష్ణారెడ్డి జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలను పలువురు ఉద్యోగులు అభినందించారు.

తిరుపతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.76 కోట్లు

తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.76 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 70,570 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,490 మంది తలనీలాలు సమర్పించారు.

ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్లుగా అవకాశం

తిరుపతి అర్బన్, మార్చి 5: శ్రీకాళహస్తి డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు అర్హులకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల డ్రైవర్లు హెవీ లైసెన్స్ కలిగి 18నెలలు పూర్తయినవారు ఒరిజనల్ లైసెన్సుతో ఈనెల 12లోపు శ్రీకాళహస్తి డిపో మేనేజర్‌ను సంప్రదించాలి. రోజుకు వేతనం రూ.800గా నిర్ణయించారు. మరిన్ని వివరాల కోసం 99592 25673 నెంబరును సంప్రదించాలని సూచించారు.

బాధితురాలికి సీపీఎం నేతల పరామర్శ

తిరుపతి(ఆటోనగర్), మార్చి 5: సామాజిక కార్యకర్త మునిలక్ష్మిపై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ట్యూషన్ కేంద్రం నుంచి ఇంటికి వెళ్లే సమయంలో దుండగులు వెనుకనుంచి దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. పరామర్శించిన వారిలో కె.మురళి, వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5: ఎస్వీయూ పరిధిలో పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 15వ తేదీ దాకా రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

రేపు సారంగపాణి ప్రాజెక్టు ప్రారంభం

తిరుపతి (కల్చరల్), మార్చి 5: చిత్తూరు జిల్లా కార్వేటినగరం ప్రాంతంలో నివసించిన 17వ శతాబ్దానికి చెందిన వాగ్గేయకారుడు, కర్ణాటక సంగీత స్వరకర్త, వేణుగోపాలస్వామి భక్తుడు సారంగపాణి పేరిట టీటీడీ ఓ ప్రాజెక్టును ప్రారంభించనుంది. సుమారు 5వేలకు పైగా కీర్తనలు రచించిన ఈయన జీవన విశేషాలు భావితరాలకు అందించడానికి ఈ ప్రాజెక్టు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. శ్వేత భవనంలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో ప్రముఖ సినీ నేపథ్య గాయని పి.సుశీల, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్వీబీసీ చైర్మన్ సాయి కృష్ణయాచేంద్ర తదితరులు పాల్గొంటారు.





జంతు నమూనాలను విద్యార్థులకు వివరిస్తున్న ఏడీ జగపతిరామయ్య, హెడ్ రాంబాబునాయక్ - డాగ్‌షోని ప్రారంభిస్తున్న డీఎస్‌పి డాక్టర్ జేవీరమణ

వెటర్నరీలో ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ ప్రారంభం

తిరుపతి(విద్య), మార్చి 5: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో రెండ్రోజుల ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్ (పశువిజ్ఞాన ప్రదర్శన) మంగళవారం ప్రారంభమైంది. నగరంలోని పలువిద్యాసంస్థల విద్యార్థులు ఈ ప్రదర్శనను వీక్షించారు. పశుశరీర నిర్మాణశాస్త్రంలో పొందుపరచిన జంతు అస్థిపంజరాలను విద్యార్థులు తిలకించారు. అలాగే పౌల్ట్రీ విభాగంలో పలుకోళ్లజాతులు, కుందేళ్ల, పిగరీ ఫామ్‌లతోపాటు పాథాలజీ మ్యూజియం, డెయిరీ టెక్నాలజీ లేబొరేటరీలను సందర్శించారు. వీరికి ఏడీ డాక్టర్ జగపతిరామయ్య, ఫిజియాలజీ హెడ్ డాక్టర్ బి.రాంబాబునాయక్‌లు పలు జంతునమూనాలను, ఇతర పశువైజ్ఞానిక అంశాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బుధవారం కూడా ఈప్రదర్శన కొనసాగుతుందని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాయంత్రం వెటర్నరీ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించిన డాగ్‌షోని వర్సిటీ డీఎస్‌పి డాక్టర్ జేవీ రమణ ప్రారంభించారు. ఈప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్ మురళి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణదాన పథకానికి 22 మంది ఎంపిక

తిరుపతి సిటీ, మార్చి 5: స్విమ్స్‌లో అర్హులైన పేద రోగులకు టీటీడీ ప్రాణదాన పథకం కింద ఉచిత శస్త్ర చికిత్సలు చేసేందుకు 22మంది రోగులను ఎంపిక చేశారు. స్విమ్స్‌లోని కమిటీ మందిరంలో డైరెక్టర్ ఆర్వీ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాణదాన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. విభాగాల వారీగా.. న్యూరోసర్జరీ 6, కార్డియో థొరాసిక్ 5, మెడిసిన్ 4, నెఫ్రాలజి 3, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ 3, న్యూరాలజీ 1 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద రోగులకు ఉచిత శస్త్ర చికిత్సలు చేసేందుకు ఆర్థిక సాయం అందిస్తున్న టీటీడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చేయూతనందిస్తే మరింత మంది రోగులకు ఉచిత శస్త్ర చికిత్సలు చేసే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్, కమిటీ సభ్యులు కుసుమ కుమారి, రవికుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శిశు సంక్షేమశాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ, మార్చి 5: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్ స్టాప్ సెంటర్(సఖి) అత్యవసర సేవల ఉద్యోగాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, వికలాంగులకు పదేళ్ల వయస్సు సడలింపు ఉంటుందన్నారు. అలాగే అత్యాచారానికి గురైన మహిళలకు 50 శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు బుధవారం నుంచి ఈనెల 16వ తేదీలోపు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల్లోపు కలెక్టరేట్‌లోని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, మహిళా సాధికారితాధికారికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

తిరుపతి సిటీ, మార్చి 5: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రసూతి ఆస్పత్రిలో మంగళవారం క్యాన్సర్‌పై మహిళా వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్వీ వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ ప్రసంగించారు. క్యాన్సర్‌ను మొదట్లోనే గుర్తిస్తే భయపడాల్సిన అవసరం లేదని ప్రాణాల మీదకి రాకుండా జాగ్రత్తపడవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ప్రసూతి ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైల్లో ప్రయాణించిన మాజీ ఉపరాష్ట్రపతి



రైల్వే స్టేషన్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

తిరుపతి (ఆటోనగర్), మార్చి 5: తిరుపతిలో మంగళవారం తన పర్యటన ముగించుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తిరుగు ప్రయాణంలో రైలెక్కారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కి గూడూరుకు వెళ్లారు. ఈ సందర్భంగా స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ చిన్నప్పరెడ్డి, బీజేపీ నాయకుడు భాను ప్రకాష్‌రెడ్డి, రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం నాయుడు తదితరులు వీడ్కోలు పలికారు.

వాయిదాలకు హాజరుకాని వ్యక్తికి రిమాండ్

తిరుపతి(లీగల్), మార్చి 5: చెక్ బౌన్స్ కేసులో వాయిదాలకు హాజరుకాని భవానీనగర్‌కు చెందిన వక్కుల ఉమాపతికి 15రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ తిరుపతి ఆరో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి విజయచంద్ర రాణా ఆదేశించారు. ఉమాపతిపై కొర్లగుంటకు చెందిన జి.నాగరాజు తిరుపతి కోర్టులో చెక్ బౌన్స్ కేసు వేశారు. వాయిదాలకు ఉమాపతి హాజరుకాలేదు. దాంతో న్యాయమూర్తి ఎన్‌బీడబ్ల్యూ జారీ చేస్తూ కోర్టు కమిషనర్‌ను అపాయింట్ చేశారు. దీంతో సోమవారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచగా, రిమాండ్‌కు ఆదేశించారు.

కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మాంగాటి



తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 5: కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా తిరుపతికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు మాంగాటి గోపాల రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి తులసిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన పార్టీ పెద్దలు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, రాయలసీమ ఇన్‌చార్జి జంగా గౌతమ్, మీడియా ఇన్‌చార్జి తులసిరెడ్డికి మాంగాటి కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరహరిరెడ్డి



తిరుపతి(లీగల్), మార్చి 5: వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతికి చెందిన సీనియర్ న్యాయవాది బి.నరహరిరెడ్డిని నియమించారు. ఈయన తిరుపతి బార్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా రెండుసార్లు, రాష్ట్రప్రభుత్వం తరపున ఏజీపీగా మూడు సార్లు పనిచేశారు.

తిరుమలలో వేసవి రద్దీపై ఈవో సమీక్ష

తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం వేసవిలో వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం సాయంత్రం ఈ అంశంపై అధికారులతో సమీక్షించారు. మొదటిఘాట్‌లోని అక్కగార్ల ఆలయం, శ్రీవారిసేవా సదన్, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో కూల్ పెయింట్ వేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండాలన్నారు. తగినన్ని లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచాలన్నారు. యాత్రికుల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను తగినంత నిల్వ ఉంచాలని వైద్య అధికారులకు సూచించారు. అన్ని ప్రాంతాల్లో అవసరమైన నీటి సరఫరాకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. కాగా.. ఈనెల 25వ తేదీన తిరుమలలో జరగనున్న తుంబరతీర్థ ముక్కోటి ఏర్పాట్లపైనా సమీక్షించారు. 60 ఏళ్లలోపు శారీరకంగా దృఢంగా ఉన్న యాత్రికులను మాత్రమే ఈమార్గంలో ట్రెక్కింగ్‌కు అనుమతించాలన్నారు. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

తిరుచ్చి, నంది వాహనాలపై కపిలేశ్వరుడి చిద్విలాసం




తిరుపతి (కల్చరల్), మార్చి 5: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు కామాక్షి సమేత సోమస్కంద మూర్తి తిరుచ్చి వాహనంపై విహరించారు. ఈ ఊరేగింపు భక్తుల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ కపిలతీర్థం నుంచి అన్నారావు కూడలి, వినాయక నగర్ క్వార్టర్స్, ఎన్‌జీవో కాలనీ, అలిపిరి బైపాస్ రోడ్డు మీదుగా తిరిగి కపిలతీర్థం చేరుకుంది. అనంతరం ఆలయంలో సోమస్కందస్వామి, కామాక్షి అమ్మవార్లకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం మూడు నుంచి 3.30 గంటల వరకు స్వామి వారికి అభిషేకసేవ జరిగింది. సాయంత్రం ఆరు గంటల నుంచి విశేష దీపారాధన చేశారు. రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు స్వామి అమ్మవార్లు అధికార నంది వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో శ్రీవేంకటేశ్వర సంగీత నృత్యకళాశాల, నాదస్వర డోలు పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన గాత్ర సంగీత కార్యక్రమాలు, నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

హరిరామ జోగయ్యను కాపులు నమ్మరు

కుమారుడిని వైసీపీలోకి పంపి నాటకాలు ఆడుతున్నారు ● కాపు సంక్షేమ శాఖ జిల్లా నాయకుల రాజీనామా



లేఖలను చింపుతున్న నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 5: హరిరామ జోగయ్యను కాపులు నమ్మే పరిస్థితిలో లేరు. లేఖాస్త్రాలతో పొత్తును విడగొట్టే ప్రయత్నం చేస్తూ.. మరోపక్క కుమారుడిని వైసీపీలోకి పంపి నాటకాలు ఆడుతున్నారు. అందువల్ల కాపు సంక్షేమ సేనలో ఉండలేం' అని ఆ సంఘానికి చెందిన జిల్లా నాయకులు రాజీనామా చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో కాపు సంక్షేమ సేన నగర అధ్యక్షుడు వంశీ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని కాపు, బలిజలను అయోమయానికి గురిచేస్తూ వివాదాలకు కారణమవుతున్న కాపు సంక్షేమసేనపై తమకు విశ్వాసం లేదన్నారు. కేవలం జనసేనాని కోసమే అందులో కొనసాగామని చెప్పారు. హరిరామ జోగయ్య లేఖలు రాస్తూ కాపుల్లో చీలిక తేవడానికి కారణమవుతున్నారని విమర్శించారు. దీనిపై స్పందిస్తే కాపు సంక్షేమసేన నుంచి తనను, హిమవంత్, కొండ రాజమోహన్‌ను తొలగిస్తున్నట్లు లేఖలు మీడియాకు విడుదల చేశారన్నారు. శతకోటి సంస్థల్లో కాపు సంక్షేమ సేన ఒకటని అందులో కొనసాగడం తమకు ఇష్టం లేదని.. ఆ తొలగింపు లేఖలను మీడియా ముందు చింపేశారు. తన కన్నకొడుకును అదుపు చేయలేని జోగయ్యకు తమకు దిశానిర్దేశం చేసే అర్హత లేదన్నారు. కాపుల అభ్యున్నతికి పాటుపడే పవన్ వెంట తాము కొనసాగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజురాయల్, సురేష్ పాల్గొన్నారు.

ఎస్వీ ఆయుర్వేద కళాశాల అధ్యాపకుడికి ఫెలోషిప్



అవార్డును అందుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణ

తిరుపతి సిటీ, మార్చి 5: తిరుపతిలోని ఎస్వీ ఆయుర్వేద వైద్యకళాశాల అధ్యాపకుడు డాక్టర్ మురళీ కృష్ణను ఆయుర్వేద జాతీయ అకాడమీ ఫెలోషిప్‌తో గౌరవించింది.న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ రాజేష్ కొటేచా, రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠం అధ్యక్షుడు డాక్టర్ దేవేంద్ర త్రిగుణ, నేషనల్ ఆయుర్వేద అకాడమీ డైరెక్టర్ డాక్టర్ వందన, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఢిల్లీ డైరెక్టర్ తనూజా నెస్రీ చేతుల మీదుగా మురళీకృష్ణ ఫెలోఅఫ్‌ను అందుకున్నారు. ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, మందుల తయారీ యూనిట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన మురళీకృష్ణ వివిధ దేశాలతోపాటు భారత్‌లోని ప్రతిష్ఠాత్మక వైద్యసంస్థల్లో ఆయుర్వేద వైద్యంపై ప్రసంగాలు చేశారు. సెంట్రల్ ఆయుష్ రీసెర్చ్ బోర్డులో సభ్యుడిగా సేవలందించారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఆయన స్వగ్రామమైన బాపట్ల జిల్లా కొరశపాడు మండలం దైవలరావూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వర్మి కంపోస్ట్ తయారీపై శిక్షణ

తిరుపతి(విద్య), మార్చి 5: ఎస్వీ వ్యవసాయ కళాశాలలో కీటకశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు మంగళవారం వర్మి కంపోస్ట్ తయారీపై శిక్షణ నిర్వహించారు. పశువుల ఎరువును నేరుగా ఉపయోగించడం కన్నా వర్మి కంపోస్టుగా మార్చడం ద్వారా ఎక్కువపోషకాలను పంటలకు అందించవచ్చని చెప్పారు. ఏడీ ప్రభాకర్‌రెడ్డి, కీటకశాస్త్ర ప్రొఫెసర్ రాజశ్రీ, ఎంఎస్‌వీ చలం పాల్గొన్నారు.

విరాళం రశీదు ఏమైంది...?

శ్రీకాళహస్తి, మార్చి 5: ముక్కంటి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భక్తులు నగదు విరాళం సమర్పించే రశీదు ఒకటి అదృశ్యమైంది. రశీదు మాయంపై మంగళవారం పెద్ద ఎత్తున చర్చనీయాంశాంగా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు... శ్రీకాళహస్తికి చెందిన ఓ భక్తుడు కుటుంబంతో పాటు సోమవారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంలో నిత్యాన్నదానం కోసం విరాళం సమర్పించారు. అధికార పార్టీ నాయకుడి అండతో శ్రీకాళహస్తి మండలం వేలవేడు గ్రామానికి చెందిన యువకుడు ఉచిత సేవకుడిగా ఆలయంలో పనిచేస్తుంటాడు. అదే యువకుడు భక్తులకు రశీదు ఇచ్చిన తర్వాత దాని కింద రికార్డుగా ఉండాల్సిన డూప్లికేట్ రశీదును మాయం చేశాడు. ప్రతిరోజూ విరాళంగా వచ్చిన నగదును ఓ ఆలయ ఉద్యోగి బ్యాంకులో జమ చేస్తుంటారు. మంగళవారం రశీదులు లెక్క సరిపోకపోవడంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే ఒకటి అదృశ్యమైనట్టు తేలింది. సీసీ కెమెరాలు ద్వారా అధికారులు పరిశీలించారు. ఉచిత సేవకుడిగా పనిచేసే అధికార పార్టీ యువకుడు రశీదును చించి మాయం చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. దీనిపై కొందరు అధికారులు ఈవో నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇదే తరహా ఇంతకు ముందు ఏమైనా అవకతవకలు జరిగాయా...? ఈ ఘనుడి లాగే ఇంకా ఎంత మంది అక్రమాలకు పాల్పడ్డారు...? అస్సలు ఉచిత సేవకుడుకి విరాళాలు అందుకునే అధికారం ఎలా వచ్చింది అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయండి



గాజులమండ్యంలో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం

రేణిగుంట, మార్చి 5: మండలంలోని గాజులమండ్యంలో నిర్మిస్తున్న జాతీయ రహదారిలో అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. చెన్నై-రేణిగుంటల మధ్య 205 జాతీయ రహదారి పనులు పూర్తికావస్తున్నాయి. గాజులమండ్యంలో మాత్రమే పనులు పెండింగ్ ఉన్నాయి. ఆ పనులను సైతం ప్రస్తుతం ఎన్‌హెచ్ అధికారులు ప్రారంభించారు. గాజులమండ్యం గ్రామంలో, గాజులమండ్యం పారిశ్రామికవాడలో ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద రెండు అండర్ బ్రిడ్జిలు లేకుండానే పనులు చేపట్టారు. అండర్ బ్రిడ్జిలు నిర్మించకుంటే గ్రామస్తులు అటు ఇటు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

ఇబ్బందులే ఇబ్బందులు..

గాజుల మండ్యంలో అండర్ బ్రిడ్జి నిర్మించకపోతే ప్రస్తుతం హైవేకు తూర్పువైపు నుంచి గ్రామంలోని ఆలయాలకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రావడానికి ప్రజలు, విద్యార్థులు అరకిలోమీటరు దూరం వెళ్లి యూటర్న్ తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. అలాగే నీలిసానిపేట, నల్లపాళెం, జీపాళెం, పాపానాయుడుపేట గ్రామాల మీదుగా శ్రీకాళహస్తి, గడిమల్లం ఆలయం వరకు ప్రజలు రాకపోకలు సాగించడానికి సైతం ఇవే ఇక్కట్లు పడాల్సి ఉంటుంది. ● గాజులమండ్యం ఆయిల్‌ఫ్యాక్టరీ వద్ద బ్రిడ్జి నిర్మించకుంటే పారిశ్రామిక వాడకు వెళ్లే కార్మికులు, అక్కడ తూర్పు వైపు నివసించే స్థానికులు పడమర వీధిలోని ఆలయాలకు వెళ్లడానికి అర కిలోమీటరు పైనే వెళ్లి యూటర్న్ తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. అసలే హైవే కావడంతో వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ సమయంలో ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మిస్తే సుమారు 20 గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

ఎంపీ పట్టించుకోవాలి..

స్థానికులు అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. అయితే అండర్ బ్రిడ్జి నిర్మించడం వీలుకాదని వారు స్పష్టం చేశారు. దీంతో గ్రామస్తులు సమస్యను ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గ్రామంలో పర్యటించారు. అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాన్ని పరిశీలించారు. సమస్య పరిష్కరిస్తామని చెప్పినా ఫలితం లేకపోయింది. పనులు ముందుకే సాగుతున్నాయి. మరోసారి ఎంపీ స్పందించి హైవే అధికారులతో మాట్లాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముక్కంటి సేవలో శారదా పీఠాధిపతి



శ్రీకాళహస్తి, మార్చి 5: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని మంగళవారం విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర దర్శించుకున్నారు.

సూర్యప్రభపై చంద్రశేఖరుడి రాజసం





సూర్య ప్రభ వాహనంపై స్వామివారు, చప్పరంపై అమ్మవారు



వాహన సేవల ముందు కోలాట నృత్యాలు

శ్రీకాళహస్తి, మార్చి 5: సూర్యప్రభ వాహనంపై చంద్రశేఖరుని రాజసం, చచప్పరంపై జ్ఞానాంబిక అమ్మవారి వైభవాన్ని భక్తులు దర్శించుకుని తరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు మంగళవారం ఉదయం సూర్యప్రభ, చప్పరం వాహన సేవ వేడుకగా జరిగింది. ఆలయంలో స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో కలశాలకు అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ పంచ హారతులు సమర్పించారు. ఆ తర్వాత అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను స్వర్ణాభరణాలు, విశేష పుష్పమాలతో అలంకరించారు. ధూప, దీప, నైవేద్య హారతులు సమర్పించి ఊరేగింపును ఉదయం 9గంటలకు ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య భక్తుల శివనామస్మరణతో స్వామి, అమ్మవారు రాజగోపురంలో నుంచి వాహనాల మండపం వద్దకు చేరుకున్నారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై స్వామివారు, చప్పరంపై అమ్మవారు కొలువుదీరారు. సకల ఆరోగ్యానికి ఆలవాలమైన వాయులింగ క్షేత్రంలో ముక్తి పొందిన సూర్యనారాయణమూర్తి ప్రభలపై సర్వేశ్వరుడైన చంద్రశేఖరుడు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఎంతో విశేషంగా భావించి స్వామి అమ్మవార్ల వాహన సేవను దర్శించుకున్నారు. హర మహాదేవ శంభోశంకర అంటూ పులకించారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో ముందుగా సాగిన ప్రచార రథం, ఉత్సవ కేతనం, స్వాగత తోరణాలు, సురిటీలు, గొడుగులు ఆనందకరం కలిగించాయి. అలాగే కోలాట నృత్యాలు, బ్యాండ్ వాయిద్యం, డంకా మోత, శంఖారావం, డమరుకనాథం వంటివి భక్తులను అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

నేడు గాంధర్వరాత్రి

బ్రహ్మోత్సవాల్లో నాల్గవ రోజును మూడవ తిరునాళ్లగా ఆచరిస్తారు. ఒక్కో రాత్రిని ఒక్కో విశేషంగా ఆరాధించడం తెలిసిందే. ఇందులో భాగంగా నాల్గవ రోజు బుధవారం గాంధర్వరాత్రిగా పిలుస్తారు. ఈ విశేషోత్సవం సందర్భంగా దివ్య కైలాసాన్ని తలపై ఎత్తుకుని శివభక్తిని చాటుకున్న దశకంఠుడిపై పరమేశ్వరుడు కొలువుదీరనున్నాడు. సోయగానికి ప్రతీక అయిన మయూరంపై పార్వతీ దేవి భక్తులకు దర్శనమిస్తారు. ఇక ఉదయం హంస, యాళి వాహనాలపై ఉత్సవమూర్తులు ఊరేగి దర్శన భాగ్యం కల్పించనున్నారు.

మంత్రి రోజాకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం

వైసీపీ అధిష్ఠానానికి నగరి వైసీపీ నేతల అల్టిమేటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 5: మంత్రి రోజాకు నగరి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని నియోజకవర్గ వైసీపీ నాయకులు అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డితో పాటు నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు రెడ్డివారి భాస్కర రెడ్డి, ఏలుమలై, రవి, శేఖర్‌రాజు,వాసుదేవ రెడ్డి, మునీంద్ర, లక్ష్మీపతిరాజు, శ్రీధర్‌రాజు, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో రోజాను గెలిపించడానికి ఆస్తులమ్ముకుని కష్టపడ్డామని చెప్పుకొచ్చారు. తనకు ఐదుగురు అన్నదమ్ములు అని ప్రతి సభలో ఊదరగొట్టిన రోజా ఇపుడు తమనే ఇబ్బందులపాల్జేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి పాలైన రోజాకు బాసటగా నిలిచామని, ఐరన్‌లెగ్‌గా పేరు పొందిన రోజాను గోల్డెన్‌లెగ్‌గా మార్చి 2014లో ఎమ్మెల్యేని చేశామన్నారు.నగరి నియోజకవర్గాన్ని తన అక్రమార్జనకు అడ్డాగా చేసుకున్న మంత్రి రోజా తమను పక్కకు నెట్టేసిందన్నారు. నగరి ప్రజలు ఆమె పట్ల సానుకూలంగా లేరన్నారు. వైసీపీ అధిష్ఠానం ప్రజాభీష్టంతో పాటు క్యాడర్ విజ్ఞప్తిని మన్నించి ఎమ్మెల్యే టిక్కెట్టు ఇతరులకు కేటాయిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. అలాకాదని రోజాకే సీటు కేటాయిస్తే ఓడిస్తామని హెచ్చరించారు. తమపై నిందారోపణలు చేస్తున్న మంత్రి రోజా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

రేపు పద్మావతి మహిళా వర్సిటీ స్నాతకోత్సవం

- గాయని సుశీలకు గౌరవ డాక్టరేట్
- గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక



మీడియాతో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవం గురువారం నిర్వహించనున్నారు. వివరాలను వర్సిటీలో మంగళవారం వీసీ భారతి మీడియాకు వెల్లడించారు. ఆమె మాటల్లోనే.. 'ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. గాయని పి.సుశీలకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నాం. 57మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తాం. 12మందికి పుస్తక, నలుగురికి నగదు బహుమతులిస్తాం. విద్యార్థులను ఉద్దేశించి ఇస్రో శాస్త్రవేత్త మంగళ మణి ప్రసంగిస్తారు. 859 మందికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేస్తాం. ఇటీవల కాలంలో వర్సిటీ మంచి అభివృద్ధిని సాధిస్తోంది. నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాం. పీఎం ఉష పథకం ద్వారా రూ.100 కోట్లు పొందాం' అని వీసీ వివరించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ రజని, సీనియర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి, పీఆర్వో శ్రీరజని తదితరులు పాల్గొన్నారు.

విచారణకు హాజరుకాని రమణదీక్షితులు

తిరుమల, మార్చి5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన, గౌరవప్రధాన అర్చకులు రమణ దీక్షితులు పోలీసు విచారణకు హాజరుకాలేదు. టీటీడీ పరిపాలన అంశాలు, అర్చకులు, జీయర్లు, అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నట్లుగా గత నెల 21వ తేదీన సోషల్ మీడియాలో ఓ వీడియో చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. దీనిపై జీయర్లు, అర్చకులు తీవ్రస్థాయిలో మండిపడడంతో పాటు ఆయనపై చర్యలు తీసుకో వాలంటూ టీటీడీ ఉన్నతాధికారులను కోరారు. టీటీడీ వ్యవస్థను, అధికారులను కూడా కించపరుస్తున్నట్లు రమణదీక్షితులు వ్యాఖ్యలున్నాయని భావించిన ధర్మకర్తల మండలిలో గత నెల 26వ తేదీన జరిగిన సమావేశంలో రమణదీక్షితులను టీటీడీ నుంచి తొలగిస్తూ తీర్మానం చేసింది. దీంతో పాటు 23వ తేదీన టీటీడీ ఐటీ విభాగంలోని సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మానిటరింగ్ సెల్ జీఎం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మార్చి5వ తేదీ ఉదయం 9 గంటలలోపు విచారణకు హాజరుకావాలని రమణదీక్షితులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే రమణదీక్షితులు మాత్రం 5వ తేదీ రాత్రి వరకు కూడా విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరుకాలేకపోతున్నట్టు రమణదీక్షితులు పోలీసులకు చెప్పినట్టు సమాచారం.ఈ నేపథ్యంలో పోలీసులు ఎలా వ్యవహరించబోతున్నారనే అంశం చర్చనీయాంశమైంది.

అనారోగ్యంతో ఆడసింహం మృతి

తిరుపతి(మంగళం), మార్చి 5: శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శన శాల(జూ)లో ఓ ఆడ సింహం అనారోగ్యంతో మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు క్యూరేటర్ సెల్వం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2017లో జన్మించిన ఈ సింహం ఏడాదికాలంగా ట్యూమర్ వ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో మెరుగైన వైద్యమందిస్తున్నా కోలుకోలేదన్నారు. క్రమేణా ఆరోగ్యం క్షీణించి నాలుగు రోజులుగా ఆహారం కూడా తీసుకోలేదని తెలిపారు. చివరకు తీవ్ర అనారోగ్యానికి గురై చనిపోయిందన్నారు. కళేబరాన్ని పంచనామ నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

ఎలక్ట్రీషియన్‌పై దాడి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 5: మండల కేంద్రంలో ఓ ఎలక్ట్రీషియన్‌పై ముగ్గురు దాడిచేశారు. స్థానికుల కథనం మేరకు.. నీర్పాకోట గ్రామానికి చెందిన పవన్ ఎలక్ట్రీషియన్. ఇతడు మంగళవారం సాయంత్రం ప్రధాన రహదారిలో ఓ వీధిలైటు వేశాడు. ఆ సమయంలో అక్కడే ఓ మిద్దెపై మద్యం సేవిస్తున్న ఉగ్గుమూడి గ్రామానికి చెందిన ముగ్గురు 'ఈ సమయంలో లైట్లు ఎందుకు వేశావు' అంటూ అతడిని ప్రశ్నించారు. మాటమాట పెరగడంతో ముగ్గురూ కలిసి దాడిచేశారు. పవన్‌కు గాయాలయ్యాయి. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముగ్గురినీ అదుపులోకి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటనరసింహ తెలిపారు.

శ్రీసిటీలో టీహెచ్‌కె ప్లాంటు విస్తరణకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

శ్రీసిటీ, మార్చి 5: లీనియర్ మోషన్‌గైడ్లు, రవాణా వాహనాల సామగ్రి తయారీలో పేరుగాంచిన జపాన్‌కు చెందిన టీహెచ్‌కే కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ టీహెచ్‌కే ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ప్లాంటు విస్తరణకు మంగళవారం శ్రీసిటీలో భూమిపూజ జరిగింది. టీహెచ్‌కే గ్రూప్‌చైర్మన్, సీఈవో అకిహిరో తెరమాచి అధ్యక్షతన నూతన ప్లాంటు నిర్మాణ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి, ఎస్‌ఎంసీసీ హెచ్‌క్యూ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మిమోరి, ఎండీ షిమిజు, జనరల్ మేనేజర్ వతనాబే, ఇతర పలువురు విశిష్ట అతిథులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రూ.300 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న కొత్త ప్లాంటు ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా మరో 250 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. నవంబరు 2021 నుంచి పనిచేస్తున్న శ్రీసిటీలోని టీహెచ్‌కే ఇండియా ప్రస్తుత ప్లాంటులో ఇప్పటికే దాదాపు 400 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్లుగా అవకాశం

తిరుపతి అర్బన్, మార్చి 5: శ్రీకాళహస్తి డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లగా పనిచేసేందుకు అర్హులకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల డ్రైవర్లు హెవీ లైసెన్స్ కలిగి 18నెలలు పూర్తయినవారు ఒరిజనల్ లైసెన్సుతో ఈనెల 12లోపు శ్రీకాళహస్తి డిపో మేనేజర్‌ను సంప్రదించాలి. రోజుకు వేతనం రూ.800గా నిర్ణయించారు. మరిన్ని వివరాల కోసం 99592 25673 నెంబరును సంప్రదించాలని సూచించారు.

భవన నిర్మాణాలు పూర్తిచేయండి

సత్యవేడు, మార్చి 5: మార్చి లోపు స్లాబ్ దశలో ఉన్న సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని పీఆర్ ఈఈ సత్యనారాయణరెడ్డి కోరారు. సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ డివిజన్ పరిధికి సంబంధించి నియోజకవర్గంలో కొనసాగుతున్న పలు ప్రభుత్వ భవన నిర్మాణాల ప్రగతిపై మంగళవారం పంచాయతీరాజ్ ఎస్‌ఈ శంకర్‌నారాయణ, ఈఈ సత్యనారాయణరెడ్డి సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశ నిర్వహించారు. ఏడు మండలాల్లో కొనసాగుతున్న సచివాలయ భవన నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలతో పాటు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంజూరైన రోడ్ల ప్రగతిపై సమీక్షించారు. కాంట్రాక్టర్లకు అందవలసిన పెండింగ్ బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీరాజ్ డీఈ మధుసూదన్, ఇంజనీర్లు దేవి ప్రసాద్, మణిబాబు, బాలాజీ, మదన్ పాల్గొన్నారు.

● ఎన్నికల వేళ... సమీక్షలు ఎందుకో

నియోజకవర్గంలో జరుగుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక, నిధులు మంజూరు కాక నాలుగేళ్లగా పనులన్నీ పడకేశాయి. మరో వారం పది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానున్న సమయంలో అధికారులు సమీక్షల పేరుతో సమావేశం నిర్వహించడం గమనార్హం. సచివాలయ భవన నిర్మాణాలపై ఏరోజూ జిల్లా ఉన్నతాధికారులు సమీక్షించిన దాఖలాలు లేవు. ప్రస్తుత సమీక్షల వల్ల నెలాఖరు లోపు నిర్మాణాలు పూర్తవుతాయా అన్నది ప్రశ్నార్థకమే.

వైసీపీని సాగనంపుదాం: హెలెన్



కరపత్రాలను అందజేస్తున్న హెలెన్, టీడీపీ నాయకులు

నారాయణవనం, మార్చి 5: రాష్ట్రాన్ని అప్పులో ఊబిలోకి నెట్టిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ అన్నారు. మంగళవారం నారాయణవనంలోని బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి బాబు సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను గురించి వివరిస్తూ, కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ హామీతో నిరుద్యోగ యువతను జగన్ మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల్లో ముంచేశారని, చివరకు రాష్ట్ర సచివాలయాన్ని సైతం కుదవ పెట్టిన ఘనత జగన్ రెడ్డిదేనని అన్నారు. సంక్షేమం మాటున దోచుకుంటున్నారని, వైసీపీ అక్రమాలను, అన్యాయాలను ప్రశ్నించే వారిని దాడులు, కేసులతో వేధిస్తున్నారని, చివరకు మీడియాపై దాడులకు పూనుకోవడం దారుణమని అన్నారు. ప్రజలకు సంక్షేమం అందిస్తూ రాష్ట్రాన్ని దిశగా అభివృద్ధి నడపాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మన్యూనతా భావం వదలాలి: రోజా



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

పుత్తూరు, మార్చి 5: మహిళలు ఆత్మన్యూనతా భావం వదలితే మగవాళ్లతో దీటుగా సమాజంలో ఎదగవచ్చని మంత్రి రోజా అన్నారు. పుత్తూరులోని ఏడీకే కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా సాధికారత వారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనకు దివంగత ముఖ్యమంత్రి జయలలిత స్ఫూర్తిని ఇచ్చారని అన్నారు.సినీ రంగంతో పాటు రాజకీయాల్లోనూ ఆమె తనదైన శైలిలో చెరగని ముద్రవేశారని కొనియాడారు. మహిళలకు తాను తోబుట్టువులా అండగా వుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీలు మునివేలు, దీప, సీడీపీవో పద్మజ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకరన్

పుత్తూరు టౌన్, మార్చి 5: జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి కరుణాకరన్ అధికారులకు సూచించారు. ఈ నెల 16వ తేదీ జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి మంగళవారం కోర్టు ఆవరణలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, మండల పరిషత్, బ్యాంక్, న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాలైన కేసులను రాజీ మార్గంలో పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, డీఎస్పీ, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండండి

పుత్తూరు టౌన్, మార్చి 5: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి కరుణాకరన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీయూపీ మెయిన్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలు, విద్యాహక్కు చట్టాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విశదీకరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఎటువంటి తినుబండారాలు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కోసమే సూపర్ సిక్స్ : టీడీపీ



సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, మార్చి 5: అన్ని వర్గాల సంక్షేమం కోసమే సూపర్ సిక్స్ పథకాలను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రూపకల్పన చేసినట్లు మున్సిపల్ మాజీ చైర్మన్, ఆ పార్టీ యూనిట్ ఇన్‌చార్జి ఎంఎస్ కరుణాకరన్ చెప్పారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సూపర్ సిక్స్ పథకాలు దోహదం చేస్తాయని తెలిపారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న గాలి భానుప్రకాష్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్‌ఎన్ ధనపాల్, బూత్ ఇన్‌చార్జి ఎంపీ సోము, అశోక్, మోహన, మేనక, మంజుల, కోమతి, అమ్ములు, ముత్తుమణి, కన్నెమ్మ, ఎంఎస్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల మల్లికార్జునస్వామికి పాగా వస్త్రం

పుత్తూరు టౌన్, మార్చి 5: శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి సేవకు పుత్తూరు మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన సామా దేశయ్య పాగా వస్త్రం సిద్ధం చేశారు. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి శివరాత్రి పర్వదినం సందర్భంగా పాగాలంకరణ సేవ నిర్వహిస్తారు. స్వామివారి సేవ కోసం సామా దేశయ్య చేనేత మగ్గంపై 300 మూరల పొడవు, ఒక మూర వెడల్పుతో తెల్లని వస్త్రాన్ని ప్రత్యేకంగా తయారు చేశారు. సాధారణంగా వివాహ సమయంలో పెళ్లి కుమారుడికి తలపాగా చుట్టడం వైదిక సంప్రదాయని, శైవక్షేత్రాల్లో ఒక్క శ్రీశైలంలో మాత్రమే ఈ ఆచారం కొనసాగుతోందని, స్వామి వారి పాగాలంకరణ సేవకు వస్త్రాన్ని తయారు చేసి సమర్పించడం తమ పూర్వ జన్మసుకృతమని దేశయ్య అన్నారు.





పాగాలంకరణ వస్త్రాన్ని నేస్తున్న సామా దేశయ్య - సిద్ధమైన వస్త్రం

బీజేపీలో చేరిన సిద్ధార్థ అశోక్‌రాజు



పురందేశ్వరి చేతుల మీదుగా బీజేపీ కండువా కప్పుకుంటున్న అశోక్‌రాజు

నగరి, మార్చి 5: నగరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల అధినేత అశోక్‌రాజు మంగళవారం విజయవాడలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అశోక్‌రాజుకు పురందేశ్వరి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నరేంద్రమోదీ సిద్ధాంతాలకు ఆకర్షితుడనై బీజేపీ చేరుతున్నట్లు ఆయన తెలిపారు. అశోక్‌రాజు టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు వ్యక్తిగత సహాయకుడిగా సైతం పనిచేశారు. జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు జగదీశ్వర నాయుడు, జిల్లా ఇన్‌చార్జి రాటకొండ విశ్వనాథ్, మహిళామోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణ స్వామి నాయుడు, శ్రీనివాసులు, వెంకటముని, రమేష్ నాయుడు, తులసీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, స్థానికులు

తాగునీటి కొళాయిని పునరిద్ధరించండి

పుత్తూరు టౌన్, మార్చి 5: పుత్తూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న తాగునీటి కొళాయిని వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు వెంకటేష్ మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఆస్పత్రి రోగులు, వృద్ధులు, విద్యార్థులు, వికలాంగులు, వ్యాపరస్తులు, ఆటో కార్మికులకు అనుకూలంగా ఉండే తాగునీటి కొళాయిని మున్సిపల్ అధికారులు కొంత కాలం క్రితం మూసివేశారని తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వేసవి దృష్ట్యా అధికారులు స్పందించి కొళాయిని పునరుద్ధరించాలని వారు కోరారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు నందయ్య, విజయ్, సుధాకర్, మనోహర్, కృష్ణమూర్తి, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.76 కోట్లు

తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.76 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి మంగళవారం ఉదయం ప్రకటించింది.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వలంటీర్లకు వేతనాలు పెంచుతాం : టీడీపీ

శ్రీకాళహస్తి, మార్చి 5: రాజకీయాలతో సంబంధం లేకుండా నిస్వార్థంగా పనిచేసే వలంటీర్లకు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై మంగళ వారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వలంటీర్లను కొనసాగించి గౌరవ వేతనం పెంచాలని టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వైసీపీ మాయలో పడి వలంటీర్లు రాజకీయ ప్రలోభాలకు దిగవద్దని కోరారు.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తొట్టంబేడు, మార్చి 5: శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురం గ్రామంలోని టీటీడీ అనుబంధ ఆలయంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వ రస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళ వారం నిర్వహించారు. 9 నుంచి 18వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్స వాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ముందుగా ఆలయాన్ని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రవికుమార్‌రెడ్డి, ఆలయ అర్చకులు రమణాచార్యులు, గోపి, కృష్ణ, జయస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటు బాంబులతో అడవి పందుల వేట

● ప్రాణహాని ఉందని మహిళ ఫిర్యాదు

సత్యవేడు, మార్చి 5: సత్యవేడు మండలం అల్లప్పగుంట గ్రామంలో కొందరు నాటుబాంబులతో అడవి పందులను వేటాడి మాంసం విక్రయిస్తున్నారని అరుంధతివాడకు చెందిన మంజుల మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె కథనం మేరకు.. మంగళవారం వేకువ జామున మంజుల పొలం వద్దకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన కొందరు అడవి పందిని కోస్తున్నారు. ఆమె వారిని నిలదీసింది. వారు ఆమెపై కత్తితో దాడికి యత్నించడంతో ఆమె తప్పించుకుని వెళ్లిపోయింది. గతంలో కూడా ఓ వివాదానికి సంబంధించి ఆమెను హతమార్చేందుకు ఇంటి పరిసర ప్రాంతాల్లో నాటుబాంబులు పాతారు. ఆ నాటుబాంబులు పేలి కుక్క చనిపోయింది. ఈ సంఘటనపై అప్పటి ఎస్‌ఐ పురుషోత్తంరెడ్డికి ఫిర్యాదు చేసింది. తాజా సంఘటనలతో ప్రాణహాని ఉందని తనపై దౌర్జన్యకరంగా వ్యవహరిస్తున్న ముగ్గురుపై కేసులు నమోదు చేయాలని కోరింది.

ఉత్తమ వీఎల్‌ఈగా ఎలియాజర్



అవార్డు అందుకుంటున్న ఎలియాజర్

వరదయ్యపాళెం, మార్చి 5: ఉత్తమ వీఎల్‌ఈ (విలేజ్‌లెవల్ ఎలివేటర్)గా సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) వరదయ్యపాళెం మండల కో-ఆర్డినేటర్ ఎలియాజర్ అవార్డును స్వీకరించారు. విజయ వాడలో మంగళ వారం మేరీస్ స్టెల్లా ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి టెలి లా వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎస్‌సీ రాష్ట్ర హెడ్ రవికుమార్ మాట్లాడుతూ 2010లో 5వేల సెంటర్లతో మొదలు పెట్టి నేడు 25వేల సెంటర్ల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అవార్డు అందుకున్న ఎలియాజర్ పల్లిపట్టును పలువురు అభినందించారు.

మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం



సమావేశమైన ప్రధానోపాధ్యాయులు

వరదయ్యపాళెం, మార్చి5: క్రీడల్లో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వారిని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామని మ్యాజిక్ బస్సు ఆర్గనైజింగ్ సంస్థ సభ్యుడు సుమంత్ తెలిపారు. మంగళవారం మండలంలోని గోవర్ధనపురం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మ్యాజిక్ బస్సు ఆర్గనైజింగ్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ప్రధానోపాధ్యాయుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో ఆసక్తిగల విదార్థులకు కబడ్డీ, ఖోఖో వంటి రాష్ట్రస్థాయి క్రీడలపై శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్ఎం రవీంద్రారెడ్డి, పీఈటీ ముద్దుకృష్ణ, జిల్లా ఫిజికల్ సంఘం ఉపాధ్యక్షులు కుమార్, సురేంద్ర, ఎంఈవో గున్నయ్య, మ్యాజిక్ బస్సు క్లస్టర్ మేనేజరు ఆనంద్, కోచ్‌లు మురళీకృష్ణ, శ్రీకాంత్, సందీప్, లత, హరికృష్ణ, సతీష్, కిరణ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



సత్యవేడు, మార్చి 5: మండలంలోని చిన్న ఈటిపాకం పంచాయతీ పాలగుంట గ్రామంలో పేదల ఇళ్ల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని ఆక్రమణ దారుల నుంచి కాపాడాలని సర్పంచ్ గోవింద స్వామి ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రామాంజనేయులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెం.312/ఏ,313/8, 314,316 భూమిని 2004లో అప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద గ్రామంలోని 73 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. రోడ్లు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం 27 కుటుంబాల వారు నివసిస్తున్నారని తెలిపారు. జగనన్న ఇంటి పథకంలో కూడా మరికొందరికి పట్టాలు ఇచ్చారన్నారు. అదేచోట పాఠశాలకు, శ్మశాన వాటికకు కొంత భూమిని కేటాయించారని వివరించారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన ఆనందయ్య, అతని కుమారుడు కానిస్టేబుల్ జ్ఞానశేఖర్ రెండు రోజుల క్రితం ఎక్సకవేటర్ తీసుకొచ్చి భూమిలో దౌర్జన్యంగా ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, శ్రీరాములు, నాగరాజు, రమణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

హస్తకళలు దేశానికి ప్రత్యేకం

● మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి
● హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



కలంకారీ చిత్రాలను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

ఏర్పేడు, మార్చి 5: హస్తకళలు దేశానికి ఎంతో ప్రత్యేకమని ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి తెలిపారు. ఏర్పేడులోని ఏపీహెచ్‌డీసీ, డీసీహెచ్ సంయుక్తంగా రూ.4.27 లక్షల వ్యయంతో నిర్వహిస్తున్న కలంకారీ పెయింటింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. మహిళ హస్తకళాకారులు వేసిన కలంకారీ చిత్రాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసు కున్న వారికి దేశవ్యాప్తంగా ఉన్న లేపాక్షి హస్తకళల ఎంపోరియం, ఎగ్జిబిషన్లద్వారా వారు చేసిన కలంకారీ చిత్రాలను విక్రయించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి, తిరుపతి శ్రీనివాసం లేపాక్షి మేనేజరు రవి, సిబ్బంది, శ్రీధర్, వైవీ.రాం, ఆంజనేయులు, గుణశేఖర్, సాయి, నవీన్‌కుమార్, లక్ష్మి, రమణయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయంలో ప్రారంభమైన శివరాత్రి ఉత్సవాలు



ఏర్పేడు, మార్చి 5: చిందేపల్లిలో వెలసిన పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 7.30గంటలకు వేద పండితులు మొదటగా గోపూజ చేశారు. 8.30గంటల నుంచి అనుజ్ఞ లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం జరిగింది. సాయంత్రం 5.30 నుంచి 7గంటల వరకు మన్యు సూక్తహోమం జరిగింది. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్త గిరిధర్‌రెడ్డి, సర్పంచ్ పెంచలయ్య, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 5: బాల్యవివాహాలు చేయడం నేరమని శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాల్య వివాహాల నిర్మూలన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివపార్వ తుల కల్యాణం రోజున బాల్య వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రగతి స్వచ్ఛత సంస్థ మండల కో-ఆర్డినేటర్ ప్రభాకర్, రామచంద్ర పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉన్నత అవకాశాలు



స్కిమ్స్ కళాశాలలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి

శ్రీకాళహస్తి, మార్చి 5: నైపుణ్యంతోనే ఉన్నత అవకాశాలు లభిస్తాయని ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి అన్నారు. కాపుగున్నేరి వద్ద ఉన్న స్కిమ్స్ కళాశాలలో మంగళవారం రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ సంస్థ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించింది. పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మిద్దెల హరి వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ సంస్థ హెచ్‌ఆర్ భాను ప్రకాష్, మార్కెటింగ్ మేనేజర్ హరీష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాదేవి, డైరెక్టర్ శ్రీకుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సరస్వతీదేవి విగ్రహ ఆవిష్కరణ

కేవీబీపురం, మార్చి5: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులచే పాఠశాల ఆవరణలో నిర్మించిన సరస్వతీ దేవి ఆలయాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నామని హెచ్ఎం వెంకటయ్య తెలిపారు.







యాలమూర్తి మధుసూదన్ భక్తి ప్రవచనాలు, రేణుకమ్మ బృందం భక్తిరంజని, బ్రహ్మశ్రీ వెంపరాల లక్ష్మీశ్రీనివాసమూర్తి భక్తి ప్రవచనాలు

మైమరపించిన భక్తిరంజని

తొట్టంబేడు, మార్చి 5: శ్రీకాళహస్తి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళాప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాసవి మహిళామండలి రేణుకమ్మ బృందం భక్తిరంజని కార్యక్రమం భక్తులను మైమరిపించింది. అనంతరం కడప, శ్రీయాలమూర్తి మధుసూదన్ భక్తి ప్రవచనాలు, వాగ్దేవికళాపీఠం విశాఖ పట్టణం, బ్రహ్మశ్రీ వెంపరాల లక్ష్మీశ్రీనివాసమూర్తి భక్తి ప్రవచనాలు శివభక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు దేవస్థానం అధికారులు దుశ్శాలువాలు కప్పి, స్వామిఅమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

జనసేన ప్రచార వాహనాలు ప్రారంభం



శ్రీకాళహస్తి, మార్చి 5: జనసేన వారాహి ప్రచార వాహనాలను టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి ప్రారం భించారు. పట్టణంలోని కంఠా వీధిలో జనసేన జిల్లా కార్యదర్శి కొట్టేసాయి ఆధ్వర్యంలో మంగళవారం సుధీర్‌రెడ్డి టీడీపీ-జనసేన జెండాలను ఊపి వాహనాలను ప్రారంభించారు. జనసేన జిల్లా కార్యదర్శి కొట్టేసాయి మాట్లాడుతూ కొట్టే జనసేన వారాహి వాహనాలను రాష్ట్రవ్యాప్తంగా సిద్ధం చేశామన్నారు. శ్రీకాళహస్తిలో కొట్టే ఉదయభాస్కర్ సౌజన్యంతో వాహనాలను సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొజ్జల రిషితారెడ్డి, టీడీపీ నాయకులు విజయ్ కుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై ఈవోపీఆర్డీ విచారణ



వరదయ్యపాళెం, మార్చి 5: మండలంలోని మోపూరుపల్లి చెరువులో చేపల పెంపకానికి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడంపై ఈవోపీఆర్డీ చిరంజీవి విచారణ చేపట్టారు. ఈ విషయంపై పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన ఈవోపీఆర్డీ మంగళవారం చెరువును పరిశీలించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను విచారించారు. వేలంపాట నిర్వహించకుండా చేపల పెంపకానికి ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. వివరణ ఇవ్వాలని కోరారు. విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలియజేశారు.

శ్రీసిటీకి చెరువుపై హక్కులు లేవు

శ్రీసిటీ యాజమాన్యం ప్రతినిధుల సిఫార్సు చేసిన వారికి చేపల పెంపకానికి అనుమతించినట్లు సర్పంచ్ తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయితే కేవలం నీటిని వినియోగించడం మినహా చెరువుపై శ్రీసిటీ యాజమాన్యానికి ఎలాంటి హక్కులూ లేవని, ఒకవేళ ఉంటే తమకు నివేదించాలని ఈవోపీఆర్డీ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

మహాశివరాత్రి బందోబస్తుపై ఎస్పీ సమీక్ష



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్

శ్రీకాళహస్తి, మార్చి 5: ముక్కంటి ఆలయ మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో బందోబస్తు నిర్వహణ, క్యూలైన్ల ఏర్పా టుపై ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ సమీక్షించారు. మంగళవారం ఎస్పీ ముక్కంటి ఆలయంలో క్యూలైన్ల ఏర్పాటును పరిశీలించారు. ముందుగా ఎస్పీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం మహాశివరాత్రి పర్వదినం రోజున ప్రత్యేకంగా అమలు చేయబోయే క్యూలైన్ల విధానాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఆలయ పరిపాలనా భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముక్కంటి ఆలయం, పట్టణ రహదారుల మ్యాప్‌ను వీక్షించారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా వాహనాల మళ్లింపు, నిర్దిష్టమైన పార్కింగ్ ప్రదేశాల కేటాయింపు చేయాలని అధికారులకు సూచించారు. ఎక్కడా సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్త కుండా బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగేశ్వరరావు, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు...

మూడవ తిరునాళ్లు, గంధర్వ రాత్రి (మాఘ బహుళ ఏకాదశి)

ఉబయదారులు : జూలుగంటి సుబ్బారావు-శ్రీమతి నాగలక్ష్మి, భరత్ జ్యూవలరీ, శ్రీకాళహస్తి

వాహనసేవలు...

ఉదయం 9 గంటలకు, హంస, యాళి వాహనసేవ
రాత్రి 8 గంటలకు రాణాసుర, నెమలి వాహనసేవ

నిత్య ఉత్సవాల వివరాలు..

- ఉదయం 4:30 గంటలకు, మంగళ వాయిద్యాలు
- ఉదయం 5 గంటలకు: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 6 గంటలకు; ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 7గంటలకు, ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం 8 గంటలకు పరివార దేవాలయాల నైవేద్యం
- ఉదయం 9 గంటలకు పురవీధుల ఉత్సవం
- ఉదయం 10:30 గంటలకు ఉచ్చికాల అభిషేకం
- సాయంత్రం 5 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 8 గంటలకు పురవీధుల ఉత్సవం
- రాత్రి 9 గంటలకు దర్శనం ముగింపు

సానుకూల దృక్పథంతో విజయం ఖాయం

శ్రీకాళహస్తి, మార్చి 5: జీవితంలో నిరుత్సాహ పడకుండా సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే అనంత విజయం తప్పక సిద్ధిస్తుందని మోటివేషనల్ స్పీకర్ మేధా చిరంజీవి అన్నారు. శ్రీకాళహస్తి శివారులోని ప్రైవేట్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం యువతకు 'సక్సెస్ అన్ లిమిటెడ్' అనే మోటివేషనల్ సదస్సు నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ స్వీయ క్రమశిక్షణ, పట్టుదల, ధైర్యం ఎప్పుడూ కోల్పో రాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి

తొట్టంబేడు, మార్చి 5: మండలంలోని చేమూరు, బోనుపల్లి, కంచినపల్లి పంచాయతీలలో టీడీపీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి మంగళవారం ప్రచారం చేశారు. బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌నాయుడు, మునిరాజనాయుడు, వెంకటా చలం, జడ్పీటీసీలు వెంకటసుబ్బారెడ్డి, అర్చనాదేవి, తిరుమలయ్య, కన్నలి ప్రతాప్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మునిరత్నం, గోపీనాథ్‌రెడ్డి, భాస్కర్ నాయుడు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి



ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 5: మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పురవీధుల్లో మంగళవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నారీ శక్తి వందన్ యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేయడం హర్షణీయం అన్నారు. మహిళలు మరోసారి బీజేపీ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ మహిళా మోర్చా నాయకురాలు వనతి శ్రీనివాసన్, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు జాగరణ శైలజ, నాయకులు పద్మజ, వేదవతి, కంద్రిగ ఉమ తదితరులు పాల్గొన్నారు. ● వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు పద్మశాలిపేట ప్రాంతంలో ప్రచారం చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా కోలా ఆనంద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గరికపాటి రమేష్‌బాబు, అమర్నాథ్, వాసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఆ పార్టీ ఏర్పేడు మండలాధ్యక్షుడు ఈగల బాలాజీ రాయల్ పిలుపునిచ్చారు. సరస్వతికంద్రిగ గ్రామంలో బీజేపీ నాయకులు ప్రచారం చేపట్టారు. ఆ పార్టీ నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలనను తరిమికొడదాం: సుధీర్‌రెడ్డి



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సుధీర్‌రెడ్డి

ఏర్పేడు/శ్రీకాళహస్తి, మార్చి 5: రాష్ట్రంలో సైకో పాలనను తరిమికొట్టాలని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం చిందేపల్లి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వచ్చేఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి వచ్చే రోడ్డును ఎలక్ట్రోస్టీల్స్ కాస్టింగ్ లిమిటెడ్ యాజమాన్యం ఆక్రమించుకుందని పలువురు ఆయన ఎదుట వాపోయారు. దీనిపై ఆయన స్పందిస్తూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో 20 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. చేరిన వారిలో వెంకటేష్, స్రవంతి, శాంతమ్మ, మహేష్, శేఖర్, కావేరి కుమార్ ఉన్నారు. టీడీపీ నాయకులు పొన్నారావు, ధనంజయులనాయుడు, పార్థసారథిరెడ్డి, మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, నాగరాజునాయుడు, సురేష్, జంగం తులసికుమార్, బాలసుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేమిరెడ్డిని కలిసిన సుధీర్‌రెడ్డి

రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన స్వగృహంలో కలిశారు.

టీడీపీ సీనియర్ నాయకురాలికి ఘన నివాళి

శ్రీకాళహస్తి, మార్చి 5: శ్రీకాళహస్తి పట్టణం 32వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు సులోచనమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందింది. బొజ్జల బృందమ్మ ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ● అలాగే నగిరి వీధికి చెందిన ఆనంద్ మృతిచెందడంతో బొజ్జల రిషితారెడ్డి అంజలిఘటించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్, నాయకులు పోలూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నంది వాహనంపై నీలకంఠుడు



నాగలాపురం, మార్చి 5: సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నీలకంఠుడు అధికార నంది వాహనంపై తిరువీధుల్లో విహరించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుక్కల్ పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం యాగశాల మండపంలో శాస్త్రోక్తంగా యాగశాల పూజలు నిర్వహించారు. ఆలయంలోని మూలస్థాన మూర్తులు వాల్మీకేశ్వరస్వామి, మరగదాంబిక అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో సుందరంగా ముస్తాబు చేసి నక్షత్ర హారతి, కుంభ హారతి, మహాహారతులు చేపట్టారు. తర్వాత నీలకంఠుడు పార్వతీసమేతుడై నంది వాహనాన్ని అధిరోహించి మంగళ వాయిద్యాల సవ్వడి, కోలాటాల కోలాహలం, బాణ సంచా పేలుళ్ల నడుమ తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తిరువీధి ఉత్సవం గ్రామంలో కనుల పండువగా సాగింది. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు భక్తి ప్రపత్తులతో తన్మయత్వం పొందారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక తదితర సదూర ప్రాంతాల నుంచి వందలాది భక్తులు విచ్చేశారు. శివనామ స్మరణలతో ఆలయం మార్మోగింది. పూజలకు ఆలయ పాలక మండలి చైర్మన్ ఏవీఎం. మునిచంద్రశేఖర్‌రెడ్డి (బాలాజీరెడ్డి) కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజలను ఆలయ చైర్మన్ నేతృత్వంలో బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది శరవణన్, దండపాణి, పరంధామరెడ్డి పర్యవేక్షించారు.